కి'లేడీ'లు
- డబ్బు కోసం ఘరానా మోసం
- ఆరుగురు మహిళలపై చీటింగ్ కేసు

- 7లో


కాకినాడ టూటౌన్ పోలీస్‌స్టేషన్‌వద్ద వర్షం కురుస్తుండగా రోడ్డుపై భారీగా నిలిచిన వర్షపునీరు


కాకినాడ నగరంలో ఆనంద్ థియేటర్ వద్ద వర్షం కారణంగా నిలిచిపోయిన ట్రాఫిక్

ప్రాణాలకు తెగించి.. తాడు సహాయంతో పైపుల ఏర్పాటు


ట్యాంకర్‌కు అగ్నిమాపకశాఖ భారీ పైపును తగిలించేందుకు వరద నీటిలోనే తాడు సహాయంతో వెళ్తున్న కాలనీ వాసులు


కాకినాడ ఆర్టీసీ కాంప్లెక్స్ ఆవరణలో నిలిచిపోయిన వర్షపునీరు

భారీ వర్షం
- నీట మునిగిన రోడ్లు
- లోతట్టుప్రాంతాలు జలమయం

కాకినాడ సిటీ, ఆగస్టు 7: జిల్లాలో ఆయా మండలాలతోపాటు కాకినాడ నగరంలో బుధవారం భారీవర్షం కురిసింది. రోడ్లు నీట మునిగాయి. ఉదయం గాలులతో ఎడతెరిపి లేకుండా వర్షం కురిసింది. లోతట్టు ప్రాంతాలు వర్షం నీట మునిగి పోవడంతో ప్రజలు రాకపోకలకు ఇబ్బందులు పడ్డారు. జిల్లావ్యాప్తంగా గడచిన 24 గంటల్లో 5.8 మి.మీ. సరాసరితో మొత్తంగా 122.6 మి.మీ. వర్షపాతం నమోదైంది. మండలాలవారీగా యు.కొత్తపల్లి 15.8, కిర్లంపూడి 15.2, గండేపల్లి 10, జగ్గంపేట 8.6,పెద్దాపురం 8.2, పిఠాపురం 7.6, సామర్లకోట 7.4, కాకినాడరూరల్ 7.2, గొల్లప్రోలు 6.4, కరప 6.2, ప్రత్తిపాడు 6.0, కాకినాడఅర్బన్ 5.8 మి.మీ. వర్షం కురిసింది.

సుద్దగడ్డ వరద ఉధృతి
గొల్లప్రోలు రూరల్, ఆగస్టు 7: ఎడతెరిపి లేని వర్షాలు, సుద్దగడ్డ వరద ఉధృతితో పంటపొలాలు ముంపునకు గురవుతున్నాయి. సుద్దగడ్డ(కొండకాలువ) వరద ఉధృతి గణనీయంగా పెరిగింది. ఈ నీరు పీబీసీ కాలువలోకి చేరుతోంది. ఈ ప్రభావంతో గొల్లప్రోలు మండలంలోని లక్ష్మీపురం, సీతానగరం, మల్లవరం, చినజగ్గంపేట, తాటిపర్తి గ్రామాల్లో వెయ్యి ఎకరాల్లో పంట పొలాలు ముంపునకు గురయ్యాయి. వరి, పత్తి, మిర్చితోపాటు కాయగూరలు తదితర పంట పొలాల్లోకి నీరు చేరి జలాశయాలను తలపిస్తున్నారు. చినజగ్గంపేటలో పుష్కర కాలువకు గండి పడింది. ఫలితంగా సమీపంలోని పంటపొలాలు ముంపునకు గురయ్యాయి.


గొల్లప్రోలు మండలం చినజగ్గంపేటలో ముంపునకు గురైన వరిపొలాలు

ఎంచక్కా ఎగరొచ్చు


(కాకినాడ,ఆంధ్రజ్యోతి)

- జిల్లాలో కొత్త ఎయిర్‌పోర్టు, ఎయిర్‌స్ట్రిప్ ఏర్పాటుపై కూటమి ప్రభుత్వం కసరత్తు
- ఈ రెండింటి సాధ్యాసాధ్యాలపై అధ్యయనం చేయాలని సీఎం చంద్రబాబు ఆదేశం
- వీటినిర్మాణం ఎక్కడ అనువుగా ఉంటుందో పరిశీలించాలని అధికారులకు సూచన
- కాకినాడ, కోనసీమలకు ఉపయోగపడేలా కరప ఉప్పు భూముల్లో కొత్త విమానాశ్రయం ఏర్పాటు ప్రతిపాదనలో మళ్లీ కదలిక
- తునిలో కొత్త ఎయిర్‌స్ట్రిప్ ఏర్పాటుతో పారిశ్రామిక రంగానికి ఊపు వచ్చే అవకాశం

వ్యాపార, పారిశ్రామికరంగాల్లో జిల్లాను మరింత ముందుకు తీసుకెళ్లేందుకు కూటమి ప్రభుత్వం కసరత్తు చేస్తోంది. అందుకోసం జిల్లానుంచి దేశ, విదేశాలకు మరింత కనెక్టివిటీని పెంచడం, పారిశ్రామిక, వ్యాపార దిగ్గజాలు నేరుగా ఇక్కడికే రెక్కలు కట్టుకుని వాలిపోయేలా చేయడానికి సీఎం చంద్రబాబు బృహత్తర ప్రణాళిక రచిస్తున్నారు. కాకినాడ సమీపంలో కొత్తవిమానాశ్రయం, తునిలో కొత్త ఎయిర్‌స్ట్రిప్(రన్‌వే) నిర్మించేలా అడుగులు వేస్తున్నారు. దీనికి సంబంధించి సాధ్యాసాధ్యాలపై అధ్యయనం చేయాలని అధికారులను ఆదేశించారు. ఎయిర్‌పోర్టు, రన్‌వే ఈ రెండింటినీ పట్టాలెక్కించే విషయమై ప్రతిపాదనలను వేగంగా పరిశీలించాలన్నారు. ఇవి గనుక కార్యరూపం దాల్చితే జిల్లా కు ఎయిర్ కనెక్టవిటీ పెరిగి పారిశ్రామిక, పర్యాటక రంగాలకు మరింత ఊపు రానుంది.

రెక్కలు కట్టుకుని వాలిపోవచ్చంతే..
జిల్లాలో సుదీర్ఘ సముద్రతీరం, ఓడరేవులు, పరిశ్రమలు, ఫార్మా రంగం, సెజ్ కార్యకలాపాలు నిర్వహిస్తున్నాయి. దీంతో పారిశ్రామికంగా వివిధ అవసరాలకోసం తరచూ దేశ,విదేశాల నుంచి కాకినాడకు వస్తున్న ప్రయాణికుల సంఖ్య అధికంగా ఉంటోంది. అటు జిల్లానుంచి హైదరాబాద్, ముంబై, చెన్నై, ఢిల్లీ, బెంగళూరుతోపాటు విదేశాలకు వెళ్లే వారి సంఖ్య గణనీయంగా ఉంటోంది. జిల్లాలో ఎయిర్‌పోర్టు లేకపోవడంతో ఇక్కడకు రాకపోకలకు రాజమహేంద్రవరం, లేదంటే విశాఖ విమానాశ్రయాలకు వెళ్లాల్సి వస్తోంది. ఈక్రమంలో విపరీతంగా సమయం తీసుకుంటోంది. కోనసీమ జిల్లానుంచి కూడా దేశ, విదేశాలకు వెళ్లే వారి సంఖ్య ఎక్కువే. ఈ నేపథ్యంలో జిల్లాకు విమానాశ్రయం లేక గంటల తరబడి ప్రయాణాలు చేసి వేరే ఎయిర్‌పోర్టులకు వెళ్లాల్సి వస్తోంది. పారిశ్రామిక, పర్యాటక రంగాల్లో భవిష్యత్తులో జిల్లా మరింత భారీగా అభివృద్ధి చెందనున్నందున కొత్తగా ఎయిర్‌పోర్టు నిర్మించాలని ప్రభుత్వం నిర్ణయించింది. కాకినాడ-కోనసీమ జిల్లాలకు ఉపయోగపడేలా కొత్త విమానాశ్రయం నిర్మించాలన్న ప్రతిపాదనను సీఎం చంద్రబాబు గతనెల అధికారులవద్ద ప్రస్తావించారు. సాధ్యాసాధ్యాలు పరిశీలించాలని సూచించారు. ఎయిర్‌పోర్టు నిర్మిస్తే వయబిలిటీ లోటు ఉండదని వివరించారు. దీంతో ఎయిర్‌పోర్టుఅథారిటీ ఆఫ్ ఇండియా అధికారులు రాష్ట్ర ప్రభుత్వ అధికారులతో కలిసి దీనిపై త్వరలో కసరత్తు మొదలుపెట్టనున్నారు. విమానాశ్రయం నిర్మించడానికి అనువుగా కాకినాడరూరల్ నియోజకవర్గం కరప మండలం గురజానాపల్లి, పెనుగుదురులో 500 ఎకరాలకుపైగా ఉప్పు భూములు సిద్ధంగా ఉన్నాయి. ఈ నేపథ్యంలో ఇక్కడ ఎయిర్‌పోర్టు నిర్మాణానికి అనుమతులు వచ్చేలా కనిపిస్తున్నాయి. కాగా జిల్లాకు ఆ చివరన తునిలో కొత్త రన్‌వే నిర్మించే విషయమై పరిశీలించాలని తాజాగా సీఎం చంద్రబాబు అధికారులను ఆదేశించారు. కొత్త ఎయిర్‌స్ట్రిప్(రన్‌వే) నిర్మిస్తే పారిశ్రామిక రంగానికి మరింత ఊపు వస్తుందని సూచించారు. దీంతో త్వరలో ఇక్కడ ఏప్రాంతం అయితే అనువుగా ఉంటుందనే దానిపై అధికారులు సర్వే చేయనున్నారు.

రూపురేఖలు మారినట్లే..
కొత్త విమానాశ్రయం, అటు కొత్త రన్‌వే అందుబాటులోకి వస్తే జిల్లా మరింత ప్రగతి సాధించడానికి దోహదపడనుంది. వాస్తవానికి ఈ రెండూ కార్యరూపం దాల్చితే పారిశ్రామిక రంగానికి చాలా ఉపయోగపడనుంది. కాకినాడను ఆనుకుని ఇప్పటికే రెండు పోర్టులు నడుస్తున్నాయి. అనేక చమురు, గ్యాస్‌కంపెనీలు ఇక్కడినుంచే కార్యకలాపాలు నిర్వహిస్తున్నాయి. కేజీబేసిన్‌లో గ్యాస్ నిక్షేపాల తవ్వకాలకు ఓఎన్జీసీ, రిలయెన్స్, కెయిన్ ఎనర్జీ తదితర కంపెనీలకు చెందిన ఆరు దేశాలకు చెందిన విదేశీ నిపుణులు కాకినాడ తీరంనుంచే వెళ్తున్నారు. ఈ తవ్వకాలు చేసే నిపుణులు విదేశాలనుంచి హైదరాబాద్‌లో దిగి అక్కడినుంచి విశాఖ ఎయిర్‌పోర్టుకు వస్తున్నారు. భవిష్యత్తులో జిల్లాలో ఎయిర్‌పోర్టు వస్తే వీరి రాకపోకలకు అనువుగా ఉంటుంది. నౌకా నిర్మాణ కేంద్రం, వంట నూనెల శుద్ధి పరిశ్రమలు ఇక్కడే ఉన్నాయి. కాకినాడ సెజ్‌లో ఇప్పటికే కొన్ని విదేశీ కంపెనీలు ఉత్పత్తులు చేస్తున్నాయి. భవిష్యత్తులో మరిన్ని రానున్నాయి. సెజ్‌లో కొత్తపోర్టు కూడా నిర్మాణం జరుగుతోంది. తునిని ఆనుకుని దివిస్ ఫార్మాతోపాటు సెజ్‌లో అరబిందో ఫార్మాకు కొత్తయూనిట్లు తయారవుతున్నాయి. సెజ్‌లో ఇంకా కొత్తపరిశ్రమల స్థాపనకు అవకాశం ఉంది. కోస్టల్ కారిడార్ నిర్మాణం ప్రారంభం కానుంది. ఈ నేపథ్యంలో వ్యాపారవేత్తలు, పెట్టుబడిదారులు రాక పోకలకు కొత్తఎయిర్‌పోర్టు, తునిరన్‌వే ఉపయోగపడనున్నాయి.

స్వాతంత్ర దినోత్సవ ఏర్పాట్ల పరిశీలన


పెరేడ్ మైదానంలో వేడుకల ఏర్పాట్లను పరిశీలిస్తున్న కలెక్టర్, ఎస్పీ, కమిషనర్

కలెక్టరేట్(కాకినాడ), ఆగస్టు 7: కాకినాడ పోలీస్ పెరేడ్ మైదానంలో ఆగస్టు 15న నిర్వహించనున్న స్వాతంత్ర్య వేడుకలకు సంబంధించిన ఏర్పాట్లను కలెక్టర్ షణ్మోహన్, ఎస్పీ విక్రాంత్ పాటిల్, కాకినాడ కమిషనర్ భావన కలిసి బుధవారం పరిశీలించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ స్వాతంత్ర్య వేడుకలు ఘనంగా నిర్వహించాలన్నారు. అన్ని విభాగాల అధికారులు సమన్వయంతో వ్యవహరించి వేడుకలు విజయవంతం చేయాలన్నారు. స్టేజ్ అలంకరణ, సౌండ్ సిస్టం, మైదానంలో అవసరమైన మేరకు మరమ్మతులు చేపట్టే విషయంలో అప్రమత్తంగా ఉండాలన్నారు. పైలెట్ వాహనం, శకటాల ప్రదర్శనకు ఉపయోగించే వాహనాల ఫిట్‌నెస్ చెక్ చేసుకోవాలన్నారు. ఏఎస్పీ భాస్కర్‌రావు, ఏఆర్ అదనపు ఎస్పీ సత్యనారాయణ, కాకినాడ ఆర్డీవో కిషోర్ పాల్గొన్నారు.

'స్వయం ఉపాధి'పై శిక్షణ: కలెక్టర్
కలెక్టరేట్(కాకినాడ), ఆగస్టు 7: జిల్లాలో స్వయం ఉపాధి కార్యక్రమాల శిక్షణకు కార్యాచరణ ప్రణాళిక రూపొందించాలని కలెక్టర్ షణ్మోహన్ ఆదేశించారు. కాకినాడ కలెక్టరేట్‌లో బుధవారం అధికారులతో సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వ్యవసాయం, సేంద్రీయ వ్యవసాయం, గ్రీన్‌హౌస్, మోడరన్ డ్రైఫిష్ టెక్నాలజీ వంటి వాటిపై శిక్షణ కార్యక్రమాలు నిర్వహించాలన్నారు. డీఆర్‌డీఏ పీడీ శ్రీరమణి, జిల్లా ఎంప్లాయిమెంట్ అధికారి శ్రీనివాస్, జిల్లా నైపుణ్యాభివృద్ధి అధికారి హరిశేషు, వికాస్ పీడీ లచ్చారావు, జేడీఎం కిరణ్ పాల్గొన్నారు.

చేనేత రంగం అభివృద్ధికి ప్రభుత్వం చర్యలు: కలెక్టర్


కార్యక్రమంలో మాట్లాడుతున్న కలెక్టర్ షణ్మోహన్

కొత్తపల్లి, ఆగస్టు 7: చేనేత రంగం అభివృద్ధికి తోడ్పాటునందిస్తున్న చేనేత కార్మికుల సమస్యలను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లి నూరుశాతం పరిష్కరించేందుకు కృషి చేస్తామని కలెక్టర్ షణ్మోహన్ అన్నారు. కొత్తపల్లి సురక్ష కమ్యూనిటీ హాల్లో జిల్లాచేనేత, జౌళిశాఖ ఆధ్వర్యంలో బుధవారం జరిగిన జిల్లాస్థాయి చేనేత దినోత్సవ కార్యక్రమం ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో కలెక్టర్‌తోపాటు టీడీపీ రాష్ట్ర అధికార ప్రతినిధి ఎస్వీఎస్ఎన్ వర్మ, జనసేన పిఠాపురం ఇన్‌చార్జి మర్రెడ్డి శ్రీనివాస్ చేనేత వస్త్రాల స్టాల్‌ను పరిశీలించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ పూర్వం నుంచి దేశంలోనే ప్రథమంగా ఉప్పాడ కొత్తపల్లి చేనేత వస్త్రాలకు మంచి గుర్తింపు ఉందన్నారు. మంచి నాణ్యత, ఆకర్షణీయ డిజైన్లలో చీరల తయారీలో చేనేత కార్మికులు అపార అనుభవం, నైపుణ్యం సొంతం చేసుకున్నారని కితాబిచ్చారు. చేనేత రంగం అభివృద్ధికి ప్రభుత్వం అందిస్తున్న సంక్షేమ, అభివృద్ధి ఫలాలు పూర్తిస్థాయిలో సద్వినియోగం చేసుకుని, కాలానికి అనుగుణంగా సరికొత్త డిజైన్లు రూపొందించాలని మాజీ ఎమ్మెల్యే వర్మ కోరారు. ఇంటింటి సర్వే చేపట్టి వీరికి గుర్తిం పు కార్డులు జారీ చేయాలని అధికారులకు సూచించారు. చేనేత ఉత్పత్తులు, వస్త్రాలను వినియోగించుకోవడం జీవితంలో భాగం చేసుకుని ఈ రంగానికి మరింత ప్రోత్సాహం అందించాలని జనసేన ఇన్‌చార్జి మర్రెడ్డి శ్రీనివాస్ కోరారు. కొత్త చేనేత సహకార సంఘాల ఏర్పాటుపై అధికారులు చర్యలు తీసుకోవాలని సూచించారు. పలువురు సీనియర్ చేనేత కార్మికులను కలెక్టర్ ఘనంగా సత్కరించారు. కార్యక్రమంలో జిల్లా చేనేత జౌళిశాఖ ఏడీ కె.పెద్దిరాజు, కూటమి నాయకులు డాక్టర్ జ్యోతుల శ్రీనివాస్, సత్యానందరెడ్డి పాల్గొన్నారు.

మత్స్యకారుడిని రక్షించిన కోస్ట్‌గార్డ్ సిబ్బంది


మత్స్యకారుడిని రక్షించి బోటు ఎక్కిస్తున్న కోస్ట్‌గార్డ్ సిబ్బంది

కాకినాడ క్రైం, ఆగస్టు 7: బోటులో అగ్నిప్రమాదం ఏర్పడి కాలిన గాయాలపాలైన ఓ మత్స్యకారుడ్ని ఇండియన్‌కోస్ట్‌గార్డ్ (కాకినాడ) సిబ్బంది కాపాడారు. కోస్ట్‌గార్డ్ కమాండెంట్ రాజేంద్రకుమార్ తెలిపిన వివరాలిలా ఉన్నాయి. చెన్నైకి చెందిన 21ఏళ్ల చిరంజీవి ఈనెల 5న మరో 13మంది సహచరులతో కలిసి చెన్నై ఫిషింగ్ హార్బర్ నుంచి ఓ బోటులో బయలుదేరాడు. బోటు బుధవారం కాకినాడ తీరానికి 95 నాటికల్‌మైళ్ల దూరం వచ్చేసరికి చిరంజీవి బోటులో స్టౌవ్‌పై టీకాస్తుండగా ప్రమాదవశాత్తూ స్టౌవ్ పేలి అగ్నిప్రమాదం సంభవించింది. ఈ ప్రమాదంలో చిరంజీవి తీవ్రంగా గాయపడ్డాడు. అక్కడికి సమీపంలో పహారా కాస్తున్న కాకినాడకు చెందిన చార్లీ 430 కోస్ట్‌గార్డ్ నౌక ప్రమాదాన్ని గమనించింది. కోస్ట్‌గార్డ్ అసిస్టెంట్ కమాండెంట్ సూర్యతేజ తన సిబ్బందితో ఘటనాస్థలికి చేరుకుని బోటులోని క్షతగాత్రుడిని కాకినాడ తీరానికి తరలించారు. మెడికల్ సర్జన్ లెఫ్టినెంట్ భరత్‌కుమార్ బాధితుడికి ప్రథమ చికిత్స అందజేశారు. మెరుగైన వైద్యం నిమిత్తం బాధితుడిని జీజీహెచ్ సర్జరీ విభాగానికి తరలించారు. చిరంజీవిని రక్షించిన కోస్ట్‌గార్డ్ సిబ్బందిని ఆయన అభినందించారు.

నేడు విద్యా కమిటీల ఎన్నిక
- జిల్లాలో 1281 పాఠశాలల్లో ఏర్పడనున్న కమిటీలు
- పేరెంట్స్ కమిటీ పేరు స్కూల్ మేనేజ్‌మెంట్ కమిటీగా మార్పు

తొండంగి, ఆగస్టు 7: పాఠశాల యాజమాన్య కమిటీలకు గురువారం ఎన్నికలు జరగనున్నాయి. పదవీ కాలం ముగిసినా ప్రభుత్వం ఇచ్చిన పొడిగింపు ఉత్తర్వులతో కొనసాగుతున్న పాత కమిటీల స్థానంలో నూతన కమిటీలు కొలువుదీరనున్నాయి. జిల్లాలో 1281 ప్రభుత్వ పాఠశాలల్లో నూతన కమిటీలు ఏర్పాటు కానున్నాయి. ఎన్నికలకు సంబంధించి ఈనెల 1న గురువారం అన్ని పాఠశాలల్లో ప్రధానోపాధ్యాయులు ఎన్నికల నోటిఫికేషన్ విడుదల చేశారు. 5న తుది ఓటర్ల జాబితా ప్రకటన కూడా జరిగింది. గతంలో ఎస్ఎంసీ(స్కూల్ మేనేజ్‌మెంట్ కమిటీ)గా ఉన్న పేరును వైసీపీ ప్రభుత్వం పేరెంట్స్ కమిటీగా మార్చింది. తాజాగా అసెంబ్లీ ఎన్నికల కోడ్ తదితర కారణాలతో ఈ విద్యాసంవత్సరం ప్రారంభం వరకూ కొనసాగేలా ప్రభుత్వం పొడిగింపు ఉత్తర్వులు ఇచ్చింది. దీని ప్రకారం ఇప్పటివరకూ గత కమిటీలే కొనసాగాయి. తాజాగా ప్రభుత్వం పేరెంట్స్ కమిటీ పేరును స్కూల్ మేనేజ్‌మెంట్ కమిటీగా మార్పుచేస్తూ ఎన్నికలు జరిపేందుకు సిద్ధమైంది. గతంలో జరిగిన ఎన్నికల్లో వైసీపీ నేతలు, ప్రజాప్రతినిధులు ఘర్షణ వాతావరణం సృష్టించి ప్రత్యర్థులను అడ్డుకుని ఎన్నికలను వాయిదా వేయించారు. ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లాలో వైసీపీ నేతల కనుసన్నల్లో ఎన్నికలు జరిగాయి. ఈ నేపథ్యంలో కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత తొలిసారిగా విద్యాకమిటీల ఎన్నికలకు నోటిఫికేషన్ జారీ చేసింది. దీని ప్రకారం కాకినాడ జిల్లాలో 1281 పాఠశాలల్లో ఎన్నికలు జరగనున్నాయి. ఎన్నికల్లో ఎట్టిపరిస్థితుల్లోను రాజకీయ జోక్యం ఉండకూడదని తెగేసి చెప్పింది. నోటిఫికేషన్‌లో కూడా దీన్ని స్పష్టం చేసింది. మధ్యాహ్న భోజనం, ఇతర అభివృద్ధి పనుల పర్యవేక్షణ, పిల్లల అవసరాలకు సంబంధించి కమిటీ బాధ్యత వహించాల్సి ఉంటుందని పేర్కొన్నారు. ఎన్నికల్లో కూడా తల్లిదండ్రులను మినహాయించి బయటి వ్యక్తులు ఎవరినీ లోనికి అనుమతించవద్దని ప్రభుత్వం స్పష్టం చేసింది.

పదవులు కాదు.. నియోజకవర్గ అభివృద్ధి కోసమే...
- అందరితో చర్చించి ఏ పార్టీలో చేరాలనేది నిర్ణయం
- గుర్తింపు లేకే వైసీపీని వీడుతున్నా
- వైసీపీకి రాజీనామా చేసిన పిఠాపురం మాజీ ఎమ్మెల్యే దొరబాబు

పిఠాపురం, ఆగస్టు 7: పదవులు, రాజకీయ పెత్తనంకోసం తాను పార్టీ వీడడం లేదని, పిఠాపురం నియోజకవర్గ అభివృద్ధి కోసమే ఈ నిర్ణయం తీసుకున్నానని పిఠాపురం మాజీ ఎమ్మెల్యే పెండెం దొరబాబు తెలిపారు. గత అసెంబ్లీ ఎన్నికల్లో పిఠాపురం ఎమ్మెల్యే టిక్కెట్టును జగన్ నిరాకరించినప్పటి నుంచి తీవ్ర అసంతృప్తితో ఉన్న దొరబాబు వైసీపీ ప్రాథమిక సభ్యత్వానికి బుధవారం రాజీనామా చేశారు. తన కార్యాలయంవద్ద పార్టీ ప్రజాప్రతినిధులు, నాయకులతో కలిసి ఏర్పాటు చేసిన సమావేశంలో రాజీనామా విషయాన్ని ప్రకటించి మాట్లాడారు. వైసీపీ కోసం కష్టపడి పనిచేశానని, గడపగడపకు ప్రభుత్వం కార్యక్రమం నిర్వహణలో రాష్ట్రంలో ముందంజలో ఉన్నానని తెలిపారు. అయినా పార్టీలో తనకు సరైన గుర్తింపు, ప్రాధాన్యం లభించకపోవడం, కొద్దినెలలుగా జరుగుతున్న పరిణామాలు రాజీనామా చేయడానికి కారణంగా ఆయన చెప్పారు. రెండున్నర దశాబ్దాలుగా పిఠాపురం నియోజకవర్గ ప్రజలతో మేమకమై వారి కష్టసుఖాల్లో పాలుపంచుకున్నానన్నారు. తన వెన్నంటి ఉండి అన్ని కార్యక్రమాల్లో పలువురు నాయకులు, కార్యకర్తలు, ప్రజాప్రతినిధులు, ప్రజలు భాగస్వాములు అయ్యారని చెప్పారు. వారందరికీ మంచి జరగాలన్నదే తన అభిమతమని, ఆ ఉద్దేశంతోనే వైసీపీకి రాజీనామా చేశానని తెలిపారు. తనతో కూటమి పార్టీ నేతలు టచ్‌లో ఉన్నారని, అందులో ఏ పార్టీలో చేరేది అందరితో చర్చించి వారి అభిప్రాయం మేరకు నిర్ణయం తీసుకుంటానని చెప్పారు. తాను ఎల్లప్పుడు పిఠాపురం నియోజకవర్గ ప్రజలకు అందుబాటులో ఉంటానని, వారి కష్టసుఖాల్లో చేదోడువాదోడుగా ఉంటానని చెప్పారు. కాగా మాజీ ఎమ్మెల్యే దొరబాబు రాజీనామా ప్రకటన కాకినాడ జిల్లాతోపాటు ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లా వైసీపీలో ప్రకంపనలు సృష్టించింది.


కంప్యూటర్ ఆపరేటర్‌ను కాటువేసిన పాము

కంప్యూటర్ కీబోర్డు కింద పాము

తీస్తుండగా కాటేసిన వైనం

మండపేట, ఆగస్టు 7: డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లా మండపేట మండలం ఏడిద గ్రామ పంచాయతీ కంప్యూటర్ ఆపరేటర్ చల్లా ఆదిసూర్యనారాయణమూర్తిని బుధవారం పాము కాటేసింది. ఉదయం కార్యాలయానికి వచ్చిన మూర్తి కంప్యూటర్ ఆన్ చేసేందుకు కీబోర్డు తీస్తుండగా దాని కిందే వున్న జెర్రిగొడ్డు అతడి చిటికెను వేలిపై కాటేసింది. వెంటనే అతడు కేకలు వేయడంతో సహచర సిబ్బంది వచ్చి పామును చంపేశారు. ఆ పాము ఐదు అడుగులు పైగా పొడవు ఉంది. మూర్తిని పంచాయతీ సిబ్బంది మండపేట ప్రభుత్వాసుపత్రికి తరలించగా మెరుగైన వైద్య సేవలు అందించడంతో ప్రాణాపాయం తప్పింది. మూర్తిని సర్పంచ్ బూరిగ ఆశీర్వాదం, కార్యదర్శి ఉండమట్ల వీర్రాజు, సహచర కంప్యూటర్ ఆపరేటర్లు చిట్టి, రవి పరామర్శించారు.


వీఆర్ పురం మండలం అన్నవరం చప్టాపై నుంచి కూలీలను దాటిస్తున్న స్థానికులు

పొంగి పొర్లుతున్న వాగులు వంకలు

వరరామచంద్రాపురం, ఆగస్టు 7: అల్లూరి సీతారామరాజు జిల్లా వీఆర్ పురం మండలంలో బుధవారం కురిసిన భారీ వర్షానికి వాగులు, వంకలు పొంగి ప్రవహించడంతో పాటు ప్రధాన రహదారులన్నీ జలమయమయ్యాయి. అన్నవరం చప్టాపై ఉదయం 8 గంటల నుంచే వర్షపు నీరు ప్రవహించడం మొదలైంది. చప్టాకు రెండువైపులా పర్లాంగు దూరం వర్షపు నీరు రోడ్డుపై ప్రవహించడంతో రాకపోకలు స్తంభించాయి. పనులకు వెళ్లే కూలీలు, మండల కేంద్రానికి వచ్చే ప్రజలు ఇబ్బందిపడ్డారు. మొద్దులగూడెం, సీతంపేట మధ్యలో ఉన్న చెరువు అలుగు పైనుంచి వర్షపు నీరు భారీగా ప్రవహించడంతో దాదాపు నాలుగు గంటల పాటు రాకపోకలు నిలిచిపోయాయి. కూటమి ప్రభుత్వం చొరవ చూపి అన్నవరం చప్టా దగ్గర ఎత్తు పెంచాలని మండల ప్రజలు కోరుతున్నారు.

చింతూరు: డివిజను పరిధిలోని చింతూరు, కూనవరం, వరరామచంద్రపురం, ఎటపాక మండలాల్లో బుధవారం ఎడతెరిపిలేని వర్షం కురిసింది. వాగులు, వంకలు పొంగి పొర్లాయి. వరి నాట్లతో పాటు ఇతరత్రా వ్యవసాయ పనులకు అంతరాయం కలిగింది. చింతూరు-వరరామచంద్రపురం మండలాల నడుమ ప్రధాన రహదారిపై సోకిలేరు, అత్తాకోడలు వాగు, అన్నవరం వాగు ఉధృతంగా ప్రవహిస్తున్నాయి. బుధవారం చింతూరులో వారపు సంతకు నిత్యావసర వస్తువుల కొనుగోళ్ల కోసం వచ్చిన వారంతా వాగులు దాటి ఇళ్లకు చేరుకున్నారు.


బాధ్యతలు స్వీకరిస్తున్న రమేష్‌బాబు

అన్నవరం దేవస్థానం ఇన్‌చార్జి ఈవోగా రమేష్‌బాబు బాధ్యతల స్వీకారం

అన్నవరం, ఆగస్టు 7: అన్నవరం దేవస్థానం ఇన్‌చార్జి ఈవోగా ఉప కమిషనరు డీఎల్‌వీ రమేష్‌బాబు బుధవారం మధ్యాహ్నం 1.30 గంటలకు బాధ్యతలు స్వీకరించారు. అంతకు ముందు ఆయన సత్యదేవుడిని దర్శించుకున్నారు. దేవస్థానం ఉద్యోగులు రమేష్‌బాబుని కలిసి అభినందనలు తెలిపారు.

నేటి నుంచి బంగారు తాపడం అమరిక పనులు

రత్నగిరివాసుడైన సత్యదేవుడి ఆలయ ధ్వజస్తంభానికి నెల్లూరుకు చెందిన ఒక దాత సుమారు రూ.3కోట్ల వ్యయంతో రాగి రేకుపై బంగారు తాపడం చేయించిన సంగతి విదితమే. నూతన ధ్వజస్తంభాన్ని ఏప్రిల్ నెలలో ప్రతిష్ఠాపన చేయగా బంగారు తాపడం చేయించే ప్రక్రియ పూర్తయ్యింది. గురువారం ఉదయం దాత కొబ్బరికాయ కొట్టి బంగారు తాపడం అమరిక పనులను ప్రారంభిస్తారు.

ఏసీబీ డీఎస్పీగా కిషోర్‌కుమార్



రాజమహేంద్రవరం, ఆగస్టు 7 (ఆంధ్రజ్యోతి): అవినీతి నిరోధక శాఖ (ఏసీబీ) రాజమహేంద్రవరం రేంజ్‌లోని డీఎస్పీ-2గా ఎం.కిషోర్‌కుమార్ బుధవారం బాధ్యతలు స్వీకరించారు. తూర్పు, కాకినాడ, అంబేడ్కర్ కోనసీమ జిల్లాలు ఈ రేంజ్ పరిధిలోకి వస్తాయి. రాజమహేంద్రవరం డివిజన్‌లోని ఈస్ట్ జోన్ డీఎస్పీగా విధులు నిర్వర్తిస్తూ బదిలీపై ఆయన ఏసీబీకి వెళ్లారు.

వరద నీటిలో పడిపోయిన వ్యక్తి

రక్షించిన స్థానికులు



గొల్లప్రోలు, ఆగస్టు 7: కాకినాడ జిల్లా గొల్లప్రోలు పట్టణ శివారులోని సూరంపేట చుట్టూ వరద నీరు చేరింది. ఆ ప్రాంతానికి చెందిన కోన సూర్యనారాయణ వరద నీటిని దాటుకుంటూ సూరంపేట వెళ్తుండగా మార్గమధ్యంలో వరద నీటిలో పడిపోయాడు. అతడిని గమనించిన స్థానికులు రక్షించి ఒడ్డుకు చేర్చారు. ఎవరూ గమనించకుంటే తాను ప్రాణాలు కోల్పోయే వాడినని సూర్యనారాయణ చెప్పాడు.

లారీ ఢీకొని వ్యాన్ డ్రైవర్ మృతి


మృతుడు శివశంకర్

రాజానగరం, ఆగస్టు 7: తూర్పు గోదావరి జిల్లా రాజానగరం మండలం దివాన్‌చెరువు గామన్ బ్రిడ్జి సమీపంలో జాతీయ రహదారిపై బుధవారం తెల్లవారు జామున జరిగిన ప్రమాదంలో ఐషర్ వ్యాన్ డ్రైవర్ అక్కడికక్కడే మృతి చెందాడు. ఏలూరు జిల్లా నూజివీడు మండలం శోభనాపురం గ్రామానికి చెందిన ఈడే శివశంకర్ (39) ఐషర్ వ్యానులో విశాఖపట్నం నుంచి విజయవాడ బయల్దేరాడు. మార్గమధ్యంలో గామన్ బ్రిడ్జి వద్దకు వచ్చేసరికి టైరు పంక్చర్ కావడంతో వ్యాన్ పక్కకు పెట్టి టైరు మార్చుకుంటున్నాడు. ఆ సమయంలో అదే మార్గంలో విశాఖ నుంచి బాపట్లలోని ఎయిర్‌ఫోర్స్ క్యాంటీన్‌కు కిరాణా వస్తువుల లోడుతో వెళ్తున్న లారీ వెనుక నుంచి శివశంకర్‌ను ఢీకొంది. ఈ ప్రమాదంలో అతడు అక్కడికక్కడే మృతి చెందాడు. ప్రమాదానికి కారణమైన లారీ డ్రైవర్ షేక్ బడే స్వల్ప గాయాలతో బయటపడ్డాడు. విషయం తెలుసుకున్న రాజానగరం ఎస్ఐ మనోహర్ సంఘటనాస్థలానికి చేరుకున్నాడు. శివశంకర్ మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం రాజమహేంద్రవరం ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. ఈ మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. మృతుడికి భార్య, ఇద్దరు పిల్లలు ఉన్నారు.


నామవరంలో నిశ్చితార్థం రోజున ఫొటో (పాత చిత్రం)

కి'లేడీ'లు

▸▸ డబ్బు కోసం ఘరానా మోసం ▸▸ ఆరుగురు మహిళలపై చీటింగ్ కేసు


వధువుగా నటించిన నీరజ (పాత చిత్రం)

కాకినాడ క్రైం, ఆగస్టు 7: కష్టపడకుండా సులువుగా డబ్బు సంపాదించాలన్న దుర్బుద్ధితో ఏకంగా పెళ్లినే అపహాస్యం చేసిన ఆరుగురు మహిళలపై కాకినాడ వన్‌టౌన్ పోలీస్‌స్టేషన్‌లో కేసు నమోదైంది. వివరాలిలా ఉన్నాయి... కాకినాడ వన్‌టౌన్ పోలీస్‌స్టేషన్ పరిధిలోని పెద్ద మార్కెట్ వీధికి చెందిన తాళ్లూరి కృష్ణమోహన్ అవివాహితుడు. కాగా అతడి తరఫు బంధువులు సంబంధాన్ని కుదిర్చేందుకు శిరీష అనే మధ్యవర్తిని కలిశారు. ఈ క్రమంలో ఈ ఏడాది జూన్ 23న శిరీష అతనికి వధువు తరఫున సత్యవేణి, దుర్గ అనే ఇద్దరిని పరిచయం చేసింది. అనంతరం కృష్ణమోహన్‌ను అదేరోజు రాజమహేంద్రవరంలోని నామవరం శాటిలైట్ సిటీకి తీసుకెళ్లి వధువుగా నీరజ అనే యువతిని చూపించారు. వధువు తల్లిగా సత్యదేవి, మేనత్తగా ప్రియాదేవిలను పరిచయం చేశారు. వధువు నచ్చడంతో నిశ్చితార్థం తంతు వెంటనే చేసుకోవాలని నిర్ణయించి వధువుకు ఖర్చుల నిమిత్తం రూ.1లక్షల నగదు, ఒక ఆండ్రాయిడ్ సెల్‌ఫోను, ఒక బంగారు గొలుసు... మొత్తంగా రూ.5లక్షలు విలువైన సొత్తును వధువు తరఫున వచ్చిన సత్యదేవి, ప్రియాదేవిలకు కృష్ణమోహన్ అందజేశాడు. కొంతకాలం తర్వాత అతడికి అనుమానం వచ్చి వాకబు చేయగా అప్పటికే నీరజకు పెళ్లి అయి సంతానం ఉందని, మధ్యలో వచ్చిన మహిళలు అందరూ మోసానికి పాల్పడ్డవారేనని కృష్ణమోహన్ గుర్తించాడు. కాకినాడ వన్‌టౌన్ పోలీస్‌స్టేషన్‌లో బాధితుడి ఫిర్యాదు మేరకు ఆరుగురు మహిళలపై వన్ టౌన్ పోలీసులు చీటింగ్ కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

32 అన్న క్యాంటీన్లు ప్రారంభోత్సవానికి సిద్ధం

▸▸ రెండో విడతలో మరో మూడు క్యాంటీన్లు ▸▸ పబ్లిక్ హెల్త్ ఎస్ఈ సుధాకర్


గొల్లప్రోలులో అన్న క్యాంటీన్ భవనాన్ని పరిశీలిస్తున్న సుధాకర్

గొల్లప్రోలు, ఆగస్టు 7: ఉమ్మడి ఉభయ గోదావరి, కృష్ణా జిల్లాల పరిధిలో 33 అన్న క్యాంటీన్ భవనాలు ఈ నెల 15న ప్రారంభోత్సవానికి సిద్ధంగా ఉన్నాయని పబ్లిక్ హెల్త్ ఎస్ఈ సుధాకర్ వెల్లడించారు. బుధవారం ఆయన కాకినాడ జిల్లా గొల్లప్రోలు పట్టణంలో అన్న క్యాంటీన్ భవనాన్ని పరిశీలించారు. భవనంపై నీరు నిలిచిపోవడం పట్ల ఆగ్రహం వ్యక్తం చేశారు. శ్లాబు నీరు కారడాన్ని, వైర్లు వేలాడుతూ ఉండటాన్ని గమనించారు. అనంతరం ఎస్ఈ మాట్లాడుతూ గొల్లప్రోలు పట్టణంతో పాటు అమలాపురం, జంగారెడ్డిగూడెంల్లో క్యాంటీన్లను రెండో విడతలో ప్రారంభిస్తామన్నారు. పలు పురపాలక సంఘాలు, నగర పంచాయతీల్లో నిలిచిపోయిన తాగునీటి ప్రాజెక్టుల పనులు త్వరలోనే ప్రారంభమవుతాయని తెలిపారు. ఏలేరు రిజర్వాయర్ వద్ద ప్రాజెక్టు నిర్మాణం చేపట్టి శుద్ధి చేసిన నీటిని గొల్లప్రోలుకు పైపులైన్ల ద్వారా సరఫరా చేసే పనులను త్వరితగతిన ప్రారంభించేందుకు చర్యలు తీసుకుంటామన్నారు. అసంపూర్తిగా నిలిచిన అర్బన్‌హెల్త్ సెంటర్ పనులను త్వరగా పూర్తి చేయాలని ఈఈ హుస్సేన్‌ను ఆదేశించారు.


పడిపోయిన సినిమా చెట్టును పరిశీలిస్తున్న కలెక్టర్ ప్రశాంతి

సినిమా చెట్టును బతికించే ప్రయత్నం చేస్తాం

రోటరీ క్లబ్ సహకారం తీసుకుంటాం... కుమారదేవంను పర్యాటకంగా అభివృద్ధి చేస్తాం: కలెక్టర్ ప్రశాంతి

కొవ్వూరు, ఆగస్టు 7: సినిమా చెట్టు చిగురించేలా పునరుద్ధరణ చర్యలు చేపడుతున్నట్టు తూర్పు గోదావరి జిల్లా కలెక్టర్ పి.ప్రశాంతి తెలిపారు. కొవ్వూరు మండలం కుమారదేవంలో గోదావరి ఒడ్డున నేలకొరిగిన సినిమా చెట్టును బుధవారం ఆమె జిల్లా ఫారెస్టు అధికారులు, రోటరీ క్లబ్ సభ్యులతో కలిసి పరిశీలించారు. 150 సంవత్సరాల వయసున్న నిద్రగన్నేరు చెట్టు దెబ్బతిని రెండుగా చీలి నేలకొరిగింది. రోటరీ క్లబ్ సహకారంతో ఆధునిక సాంకేతిక పరిజ్ఞానాన్ని ఉపయోగించి పడిపోయిన చెట్టును బతికించే ప్రయత్నం చేస్తామన్నారు. ఈ ప్రాంతాన్ని పర్యాటకంగా అభివృద్ధి చేయడానికి జిల్లా టూరిజం కౌన్సిల్ ద్వారా ఏర్పాట్లు చేస్తున్నామన్నారు. డీఎఫ్‌వో బి.నాగరాజు మాట్లాడుతూ నేలకొరిగిన చెట్టు ఏపుగా, గుబురుగా పెరిగే వృక్షమన్నారు. ఎండిపోయిన బలమైన కొమ్మలను తొలగించకపోతే కాలక్రమేణా పడిపోయే ప్రమాదం ఉందన్నారు. ప్రజలు, గ్రామస్తుల మనోభావాలను కాపాడుతూ అదే చెట్టును సాంకేతికంగా బతికించుకోవడానికి ప్రవాసాంధ్రులు సైతం ముందుకు వస్తున్నారన్నారు. గతంలో 150 సంవత్సరాల చెట్టును ట్రాన్స్‌ప్లాంట్ చేయడాన్ని తాను కూడా చూశానన్నారు. అదే పద్ధతిలో ఈ చెట్టునూ బతికించే అవకాశం ఉందన్నారు. అటవీ శాఖ తరఫున సలహాలు, సూచనలు అందిస్తామన్నారు. కలెక్టర్ వెంట సబ్ కలెక్టర్ ఆశుతోష్ శ్రీవాస్తవ, ఇన్‌చార్జి తహసీల్దారు కె.అజయ్‌బాబు, రెవెన్యూ ఇన్‌స్పెక్టర్ విశ్వేశ్వరరావు, తెలుగుదేశం పార్టీ మండల శాఖ అధ్యక్షుడు వట్టికూటి వెంకటేశ్వరరావు, గన్నమని రాజు, గ్రామస్తులు ఉన్నారు.



కళావాహన అనంతరం భీమేశ్వర స్వామి మూలవిరాట్, హోమ పూర్ణాహుతిలో పాల్గొన్న మంత్రి సుభాష్ దంపతులు

భీమేశ్వరునికి ఇక జలాభిషేకమే

ద్రాక్షారామలో శాస్త్రోక్తంగా కళావాహన...పూజల్లో పాల్గొన్న మంత్రి సుభాష్ దంపతులు.. భక్తులకు దర్శనాలు ప్రారంభం

ద్రాక్షారామ, ఆగస్టు 7: ద్రాక్షారామ భీమేశ్వరస్వామి, మాణిక్యాంబ అమ్మవార్ల దర్శనానికి భక్తులను బుధవారం ఉదయం 11.05 గంటల నుంచి అనుమతించారు. మూలవిరాట్ సంరక్షణ, అభివృద్ధి గర్భాలయాలను ఏప్రిల్ 24న మూసివేసి పురావస్తు శాఖ ఆధ్వర్యంలో పనులు పూర్తి చేశారు. మూడు నెలల ఏడు రోజుల అనంతరం భీమేశ్వరస్వామి, మాణిక్యాంబ అమ్మవార్ల మూలవిరాట్‌ల దర్శనం పునః ప్రారంభించారు.

భీమేశ్వరస్వామి, మాణిక్యాంబ అమ్మవారి కళావాహనను బుధవారం వేద మంత్రాలతో శాస్త్రోక్తంగా నిర్వహించారు. గణపతి పూజ, పుణ్యాహవాచనం, పునః పూజలు, ఋగ్వేద పారాయణ, గర్భాలయ పూజలు, పరివార దేవతార్చన, కుంభాలు, గో దర్శనం, శాంతి హోమం, పూర్ణాహుతిల్లో మంత్రి వాసంశెట్టి సుభాష్ దంపతులు, ఆయన తల్లిదండ్రులు వాసంశెట్టి సత్యం దంపతులు పాల్గొన్నారు. ఉదయం 9.34 గంటలకు కళావాహన ప్రారంభించి అనంతరం స్వామివారికి జలాలతో అభిషేకం నిర్వహించారు. ఎమ్మెల్సీ తోట త్రిమూర్తులు స్వామి, అమ్మవార్లను దర్శించుకుని పూజలు చేశారు.


భీమేశ్వర స్వామి మూలవిరాట్ సంరక్షణ దృష్ట్యా కేంద్ర పురావస్తు శాఖ ఆదేశాల మేరకు జలాలతోనే అభిషేకం నిర్వహిస్తామని మంత్రి సుభాష్ ప్రకటించారు. ఆలయ ఆవరణలో ఆయన విలేకరులతో మాట్లాడారు. ప్రతిరోజూ ఉదయం దేవస్థానం ఆధ్వర్యంలో తొలి అభిషేకం నిర్వహిస్తారన్నారు. అనంతరం జలాలతో భీమేశ్వరునికి అభిషేకం జరుపుతారన్నారు. మాణిక్యాంబ అమ్మవారికి పూజలు యథావిధిగా జరుగుతాయన్నారు. పునః ప్రారంభోత్సవంలో పాల్గొనే అవకాశం రావడం పూర్వజన్మసుకృతంగా భావిస్తున్నానని చెప్పారు. జనసేన నియోజకవర్గ ఇన్‌చార్జి పోలిశెట్టి చంద్రశేఖర్, జడ్పీ మాజీ వైస్ చైర్మన్ చింతపల్లి వీరభద్రరావు, టీడీపీ నాయకులు టేకుమూడి సత్యనారాయణ, చింతపల్లి అర్జున్, గుబ్బల యేసురాజు, జాస్తి విజయలక్ష్మి, గజలక్ష్మి, జనసేన, బీజేపీ నాయకులు, కార్యకర్తలు, ఆలయ ఈవో పీటీవీ సత్యనారాయణ, ఆలయ అర్చకులు, సిబ్బంది పాల్గొన్నారు.


సింగన్నగూడెంలో మృతి చెందిన చిన్నారి తల్లిదండ్రుల నుంచి వివరాలు తెలుసుకుంటున్న విచారణ కమిటీ సభ్యులు

చిన్నారుల మృతిపై విచారణ

చింతూరు, ఆగస్టు 7: అల్లూరి సీతారామరాజు జిల్లా చింతూరు మండలంలో పది రోజుల వ్యవధిలో ఐదుగురు చిన్నారులు మృతి చెందంతో జిల్లా యంత్రాంగం కదిలింది. రెండు రోజుల్లో జరిగిన ఘటనలపై నివేదిక సమర్పించాలని కలెక్టర్ దినేష్‌కుమార్ ఆదేశించారు. జిల్లా ఇమ్యునైజేషన్ అధికారి డాక్టర్ సీహెచ్ సాధన, చింతూరు డిప్యూటీ డీఎంహెచ్‌వో డాక్టర్ పుల్లయ్య, రంపచోడవరం అడిషనల్ డీఎంహెచ్‌వో డాక్టర్ శిరీష, చింతూరు సీహెచ్‌సీ చిన్నపిల్లల వైద్య నిపుణుడు డాక్టర్ హర్షతో కూడిన ఒక కమిటీని నియమించారు. వీరంతా బుధవారం సింగన్నగూడెం, గంగన్నమెట్ట, బొడ్డుగూడెం గ్రామాల్లోని బాధిత కుటుంబాలను నేరుగా కలిసారు. చిన్నారుల తల్లిదండ్రులతో జరిగిన ఘటనలపై ఆరా తీశాక వాగులు ఉధృతిగా వున్న కారణంగా చదలవాడ, వంకగూడెం గ్రామాలకు వెళ్లలేదని వారు తెలిపారు. పూర్తిస్థాయిలో విచారణ జరిపి కలెక్టర్‌కు నివేదిక అందిస్తామని చెప్పారు.

శ్వాసకోస ఇబ్బందితో మరో బాలుడు ఆసుపత్రిపాలు



చింతూరు, ఆగస్టు 7: సరిహద్దు రాష్ట్రమైన ఒడిసాలోని మల్కన్‌గిరి జిల్లా చిన్నమదుగూరుకు చెందిన పవన్ శ్వాస పీల్చుకోడంలో ఇబ్బందిపడుతున్నాడు. దీంతో అతడి తల్లిదండ్రులు కొవ్వాసి దూలయ్య-రాజమ్మ గ్రామంలోని ఓ నాటు వైద్యుడిని మంగళవారం ఆశ్రయించారు. అతడు ఇచ్చిన చెట్టు మందుని కుమారుడికి పట్టించారు. బుధవారం ఆరోగ్యం మరింత క్షీణించడంతో చింతూరు సీహెచ్‌సీకి తీసుకురాగా సూపరింటెండెంట్ డాక్టర్ కోటిరెడ్డి నేతృత్వంలో పవన్‌కి ప్రాథమిక చికిత్స అందించారు. తర్వాత మెరుగైన వైద్యం కోసం భద్రాచలం తరలించారు.

న్యాయ పోరాటం

▸▸ అత్తింటి ఎదుట కుమారుడితో కలిసి వివాహిత దీక్ష

▸▸ అండగా నిలిచిన ఎమ్మెల్యే ఆదిరెడ్డి శ్రీనివాస్

రాజమహేంద్రవరం సిటీ, ఆగస్టు 7: న్యాయం చేయాలని ఒక వివాహిత తన కుమారుడితో కలిసి సుమారు రెండు గంటల పాటు వర్షంతో అత్తింటి ఎదుట వద్ద బుధవారం దీక్షకు దిగింది. దీంతో ఆమె భర్త, అత్తమామలు ఇంటికి తాళాలు వేసుకుని బయటకు వెళ్లిపోయారు. బాధితురాలి కథనం ప్రకారం... తూర్పు గోదావరి జిల్లా రాజమహేంద్రవరం మోరంపూడికి చెందిన రేష్మాకు రాజేంద్రనగర్ వడ్డీల వీధికి చెందిన హబీబ్ బాషాతో 2012


దీక్ష చేస్తున్న రేష్మాతో మాట్లాడుతున్న మాజీ కార్పొరేటర్ చిట్టిబాబు



అక్టోబరు 21న వివాహం జరిగింది. పెళ్లయిన పది రోజులకే అదనపు కట్నం కోసం వేధింపులు ఆరంభమయ్యాయి. 2013లో బాబు పుట్టాడు. ఆ తర్వాత ఇల్లు కట్టుకుందామని చెప్పి బంగారు మొత్తం తీసుకుని పుట్టింటి వద్ద వదిలేశాడు. ఎన్నిసార్లు ఇంటికి వచ్చినా బయటకు గెంటేసేవాడు. దీంతో 2016లో బొమ్మూరు పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేసింది. కోర్టులో కేసు వేయగా 2023లో అనుకూలంగా తీర్పు వచ్చింది. రేష్మాతో పాటు కుమారుడుని భర్త చూసుకోవాలని, నెలకు రూ.16 వేలు ఇచ్చి ఇంట్లో పెట్టుకోవాలని లేదా ఇల్లు అద్దెకు తీసిపెట్టాలని కోర్టు చెప్పినా హబీబ్ పట్టించుకోలేదు. 'నా తండ్రి కువైట్‌లో పనిచేస్తూ 2021లో కొవిడ్‌తో మరణించాడు. నాకు ఏ దిక్కూ లేదు. కుమారుడిని పెంచడం చాలా కష్టంగా ఉంది. నా భర్తకు వేరే పెళ్లి చేయడానికి తండ్రి, తల్లి, ఆడపడుచు ప్రయత్నాలు చేస్తున్నారని రేష్మా చెప్పింది. అమ్మాయిలతో గోవాలో తిరుగుతున్నాడని ఆరోపిస్తూ అందుకు సంబంధించిన ఫొటోలను మీడియాకు అందజేసింది. తనను ఏలుకోకపోతే ఆత్మహత్య తప్ప వేరే దారి కనిపించట్లేదని కన్నీరు పెట్టుకుంది. స్థానిక మహిళలు ఆమెకు అండగా నిలిచారు. బాధితురాలికి న్యాయం చేయాలని వారు డిమాండ్ చేశారు. విషయం తెలుసుకున్న ఎమ్మెల్యే ఆదిరెడ్డి శ్రీనివాస్ వెంటనే స్పందించారు. మాజీ కార్పొరేటర్ నక్కా చిట్టిబాబును పంపి బాధితురాలితో ఫోనులో మాట్లాడి ధైర్యం చెప్పారు. న్యాయం చేస్తామని, దీక్ష విరమించాలని సూచించారు. న్యాయం జరిగే వరకు అత్తింటి వరండాలోనే తాను ఉంటానని రేష్మా చెప్పింది. దీంతో భర్త, అత్తమామలను ఇంటికే పిలిపించి సమస్యను ఎమ్మెల్యే వద్ద పెట్టి న్యాయం చేస్తామని చిట్టిబాబు చెప్పారు.

ఆయిల్‌ఫామ్ తోట విస్తరణ మహోత్సవం

జగ్గంపేట, ఆగస్టు 7: జగ్గంపేటలోని గోకవరం రోడ్డులో పెద్దాపురం పతంజలి ఫుడ్స్ లిమిటెడ్ ఆధ్వర్యంలో ఉద్యానశాఖ జిల్లా నేతృత్వంలో బుధవారం ఆయిల్‌ఫామ్ తోట విస్తరణ మహోత్సవం 2024 నిర్వహించారు. జనసేన పార్టీ ఇన్‌చార్జి తుమ్మలపల్లి రమేష్ హాజరయ్యారు. మాదారపు వీరబాబు, మరిసే రామకృష్ణ, సురపరెడ్డి నరేష్, రాపేటి చిట్టిబాబు, గోకేడ ప్రసాద్, రేపూరి శ్రీనివాస్, కాయల మణికంఠ పాల్గొన్నారు.

రిటైర్డు ఉపాధ్యాయురాలు అవయవ దానం


శ్రీలక్ష్మి (ఫైల్)

సర్పవరం జంక్షన్, ఆగస్టు 7: ఆకస్మాత్తుగా బ్రెయిన్ హెమరేజ్‌కి లోనై కోమాలోకి వెళ్లి బ్రెయిన్ డెడ్ అయిన రిటైర్డు ఉపాధ్యాయురాలి అవయవాలు..మరో ముగ్గురికి ప్రాణం పోశాయి. కాకినాడ రూరల్ తిమ్మాపురం దీప్తా కాలనీకి చెందిన బల్లమూడి శ్రీలక్ష్మి (68) ఆకస్మాత్తుగా జూన్ 2024న బ్రెయిన్ హెమరేజ్‌తో కోమాలోకి వెళ్లిపోయారు. కుటుంబ సభ్యులు సర్పవరం జంక్షన్‌లో గల ఆస్పత్రిలో చేర్పించగా వైద్యులు బ్రెయిన్‌డెడ్‌గా ప్రకటించారు. అవయవదానంపై కుటుంబ సభ్యులకు అవగాహన కల్పించడంతో పుట్టెడు దుఃఖంలోనూ దానం చేసేందుకు అంగీకారం తెలిపారు. శ్రీలక్ష్మి కిడ్నీని వైజాగ్‌లో ఒమ్నీ ఆరేకే ఆస్పత్రిలో రోగికి... మరో కిడ్నీ, లివర్ అవయవాలను స్థానిక ఆస్పత్రిలో ఉన్న ఇద్దరు రోగులకు వైద్యులు విజయవంతంగా అమర్చారు. శ్రీలక్ష్మి బీఏ, బీఈడీ విద్యాభ్యాసం పూర్తి చేసి ఉపాధ్యాయ వృత్తి చేపట్టి అంకితాభావంతో విద్యాబోధన చేశారు. అనేక రచనలు రచించారు. 1996లో ఉపాధ్యాయ దినోత్సవం సందర్భంగా డాక్టర్ సర్వేపల్లి రాధాకృష్ణ అవార్డుతో పాటూ పలు అవార్డులు సొంతం చేసుకున్నారు. తన మరణం తర్వాత కూడా పలువురికి అవయవ దానం చేసి పునర్జన్మ ప్రసాదించిన శ్రీలక్ష్మిని స్ఫూర్తిని కొనియాడారు.

అల్ట్రాసౌండ్ స్కానింగ్ సెంటర్లపై ప్రత్యేక నిఘా: ఆర్డీవో

కాకినాడ సిటీ, ఆగస్టు 7: గర్భస్థ పిండ ఆరోగ్య పర్యవేక్షణకు సంబంధించిన పరీక్షలకు లింగ నిర్ధారణకు దుర్వినియోగం కాకుండా అల్ట్రాసౌండ్ స్కానింగ్ సెంటర్లపై ప్రత్యేక నిఘా పెట్టినట్లు ఆర్డీవో ఇట్ల కిషోర్ తెలిపారు. కాకినాడ రెవెన్యూ డివిజన్ కార్యాలయంలో ఆర్డీవో వైద్య, ఆరోగ్య, రెవెన్యూ, లీగల్, స్త్రీ శిశు సంక్షేమ స్వచ్ఛంద సంస్థల ప్రతినిధులతో కలిసి డివిజన్‌స్థాయి పీసీ, పీఎన్‌డీటీ సమన్వయ కమిటీ సమావేశం బుధవారం నిర్వహించారు. ఇన్‌చార్జ్ డీఐవో డాక్టర్ ఆర్.శ్రీనువాసనాయక్ మాట్లాడుతూ ఏదైనా స్కానింగ్ సెంటర్‌లో దుర్వినియోగం జరిగినట్టు గుర్తిస్తే టోల్ ఫ్రీ నెంబర్ 18004253366కు తెలియజేయాలన్నారు. సమావేశంలో జీజీహెచ్ రేడియాలజిస్టు డాక్టర్ న్యూరిషబేగం, సీడీపీవోలు జి.ఉష, ఎ.జ్యోతి, డి.సుజాత, ఐసీడీఎస్ సూపర్‌వైజర్ ఎస్.పద్మశ్రీ, హెల్త్ ఎడ్యుకేటర్ పి.సత్యవతి, మానిటరింగ్ కన్సల్టెంట్ శృతి, పాల్గొన్నారు.

'దివ్యాంగులకు 2 నెలల్లో ఉపకరణాలు'

ప్రత్తిపాడు, ఆగస్టు 7: దివ్యాంగులకు 2 నెలల వ్యవధిలో ఉపకరణాలు అందజేయనున్నట్టు విభిన్న ప్రతిభావంతుల, వయోవృద్ధుల సహాయ సంస్థ జిల్లా మేనేజర్ పి.నారాయణ మూర్తి తెలిపారు. స్థానిక ఎంపీడీవో కార్యాలయంలో బుధవారం నియోజకవర్గ దివ్యాంగుల ఉపకరణాల మంజూరు గుర్తింపు శిబిరాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా మేనేజర్ మాట్లాడుతూ అర్హులైన దివ్యాంగులకు అవసరమైన పరికరాలు 60 రోజుల తరువాత సరఫరా చేస్తామన్నారు. దివ్యాంగులకు ఏపీఎస్ ఆర్టీసీ ద్వారా బస్‌పాస్‌లు మంజూరు చేసినట్టు తెలిపారు. శిబిరానికి 600 మంది హాజరయ్యారు. కార్యక్రమంలో ఎంపీడీవో ఎస్.డేవిడ్‌రాజు, టీడీపీ నాయకులు యాళ్ళ జగదీష్, కొమ్ముల కన్నబాబు, వెన్నా శివ, బద్ది రామారావు, రావూరి తాతాజీ, వెలుగుల నాని, ముత్యాల రాంబాబు, పోలిశెట్టి శ్రీను, బదినే దొరబాబు, కాకినాడ రూరల్ మండలం రాయుడుపాలెనికి చెందిన ఉమా ఎడ్యుకేషన్ టెక్నికల్ సొసైటీ సిబ్బంది పాల్గొన్నారు.

నేడు దివ్యాంగుల ఉపకరణాల ప్రత్యేక శిబిరం

సర్పవరం జంక్షన్, ఆగస్టు 7: కాకినాడ రూరల్ రమణయ్యపేట మండల పరిషత్తు కార్యాలయంలో గురువారం ఉదయం నుంచి సాయంత్రం వరకు దివ్యాంగులకు ఉపకరణాల మంజూరు కోసం ప్రత్యేక శిబిరం నిర్వహిస్తున్నట్టు ఎంపీడీవో రమేష్‌నాయుడు తెలిపారు. విభిన్న ప్రతిభావంతులకు 3 చక్రాల సైకిళ్లు, వీల్‌ఛైర్లు, చంక కర్రలు, కృత్రిమ కాళ్లు, కాలిపర్స్, రోలేటర్స్, చెవి మిషన్లు, వాకింగ్ స్టిక్స్, మానసిక ప్రతిభావంతుల పిల్లలకు ఎంఎస్ఈఈ కిట్లు, లెప్రసీ సోకిన వారికి ఏడీఎల్ కిట్లు, సీపీ ఛైర్ బ్యాటరీ ఆపరేటెడ్ 3 చక్రాల సైకిల్ కోసం గుర్తింపు శిబిరం నిర్వహిస్తున్నాని, వచ్చేవారు సదరం ధ్రువీకరణ పత్రం, రేషన్, ఆధార్‌కార్డు, యూడీఐడీకార్డు తీసుకురావాలన్నారు.

'బాలికలు క్రమశిక్షణతో విద్యనభ్యసించాలి'

ప్రత్తిపాడు, ఆగస్టు 7: బాలికలు క్రమశిక్షణతో విద్యను అభ్యసించాలని ప్రత్తిపాడు జూనియర్ సివిల్ జడ్జి కాటంబాను చెప్పారు. స్థానిక హైస్కూల్ సమీపంలోని బీసీ బాలికల వసతిగృహాన్ని బుధవారం ఆయన సందర్శించి బాలికలకు ఏర్పాటు చేస్తున్న వసతి గృహాలను తనిఖీ చేశారు. మెనూప్రకారం ఆహార పదార్థాల తయారీని పరిశీలించారు. అనంతరం బాలికలతో సమావేశమై మాట్లాడుతూ లక్ష్యాల సాధన కోసం కృషిచేయాలన్నారు. కార్యక్రమంలో వసతి గృహ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

'కళాకారులను ఆదుకుంటాం'

ఏలేశ్వరం, ఆగస్టు 7: కళాకారులను ఆదుకుంటామని ఎంపీపీ గొల్లపల్లి బుజ్జి పేర్కొన్నారు. బుధవారం పట్టణంలో ప్రైవేటు ఫంక్షన్ హోల్ నందు నాట్యాచారిణి ముళ్లపూడి విజయలక్ష్మీ నేతృత్వంలో శ్రీసీతారత్న లలిత కళానృత్య నికేతన్ 8వవార్షికోత్సవం నిర్వహించారు. ఎంపీపీ, టీడీపీ పట్టణాధ్యక్షుడు కౌన్సిలర్ మూది నారాయణ స్వామి, కౌన్సిలర్ బొదిరెడ్డి గోపి ముఖ్యఅతిథులుగా విచ్చేసి శిక్షణా తరగతుల నిర్వహిస్తున్న విజయలక్ష్మీని, నాట్యబృందానికి మెమెంటోలు అందజేసి అభినందించారు. కార్యక్రమంలో సిరిఫుడ్స్ అధినేత పెచ్చేటి కృష్ణ, తల్లిందండ్రులు తదితరులు పాల్గొన్నారు.

15న మెగా రక్తదాన శిబిరం

కాకినాడ రూరల్, ఆగస్టు 7: తలసేమియా చిన్నారుల కోసం యంగ్‌మైండ్స్ రేపటి కోసం స్వచ్ఛందసేవా సంస్థ ఆధ్వర్యంలో గాంధీనగర్‌లోని ఇండియన్ రెడ్‌క్రాస్ సొసైటీ సౌజన్యంతో స్వాతంత్ర్య దినోత్సవం సందర్భంగా ఈనెల 15న మెగా రక్తదాన శిబిరం నిర్వహించనున్నట్టు సంస్థ వ్యవస్థాపక అధ్యక్షుడు వాకాడ వెంకటరమణ తెలిపారు. రెడ్‌క్రాస్ సొసైటీలో మధ్యాహ్నం 2గంటల నుంచి నిర్వహించనున్న శిబిరంలో సైనికులు, రైతులు, యువత పాల్గొంటారని, వారందర్నీ సత్కరిస్తామని రక్తదానం చేసేవారు 9440497164కు ఫోన్‌చేసి ముందుగా పేరు నమోదు చేసుకోవాలన్నారు. కార్యక్రమంలో కాకినాడ మున్సిపల్ కమిషనర్ జి.భావన, ఇండియన్ రెడ్‌క్రాస్ సొసైటీ డైరెక్టర్ వైడీరామారావు ముఖ్యఅతిథులుగా శిబిరాన్ని ప్రారంభించనున్నారని తెలిపారు.

నేడు విద్యుత్ సరఫరాకు అంతరాయం

సామర్లకోట, ఆగస్టు 7: సామర్లకోట రూరల్ పరిధి జీ.మేడపాడు ఫీడర్లలో 33 కేవీఏ విద్యుత్ ఉపకేంద్రంలో మరమ్మతుల దృష్ట్యా వేట్లపాలెం నుంచి 11 కేవీఏ జీ.మేడపాడు ఇండస్ట్రియల్ ఫీడర్లపై గల వేట్లపాలెం, జీ.మేడపాడు గ్రామాల్లో గురువారం ఉదయం 7 నుంచి మధ్యాహ్నం 1గంట వరకూ విద్యుత్ సరఫరాకు అంతరాయం కలుగుతుందని విద్యుత్ కార్యనిర్వాహక ఇంజనీరు ఏ.ప్రభాకర్ తెలిపారు.

రేపు తాళ్లరేవు మండలంలో...

తాళ్లరేవు, ఆగస్టు 7: తాళ్లరేవు, చొల్లంగి సబ్‌స్టేషన్ పరిధిలోని 33/11కెవి లైను వార్షిక మరమ్మతుల నిమిత్తం శుక్రవారం ఉదయం 7.30 నుంచి మధ్యాహ్నం 1.30 గంటల వరకు గాడిమొగ, భైరవపాలెం పంచాయతీల పరిధిలో చొల్లంగి, చొల్లంగిపేట, జి.వేమవరం, కొత్తూరు, రామన్నపాలెం, పటవల, శాంతమూల గ్రామాల్లో విద్యుత్ సరఫరాకు అంతరాయం కలుగుతుందని ఇంజనీర్ ఎస్.ఉదయభాస్కర్ తెలిపారు.

ద్విచక్రవాహనాలకు బహిరంగ వేలం

తాళ్లరేవు, ఆగస్టు 7: తాళ్లరేవు ఎన్‌ఫోర్స్‌మెంట్ బ్యూరో స్టేషన్ పరిధిలో వివిధ నేరాలతో పట్టుబడ్డ ద్విచక్రవాహనాలకు కాకినాడ ఎన్‌ఫోర్స్‌మెంట్ అసిస్టెంట్ సూపరిండెంట్ ఎ.శ్రీరంగందొర ఆధ్వర్యంలో బహిరంగ వేలంపాట నిర్వహించనున్నట్టు బ్యూరో స్టేషన్ ఎస్ఐ చిట్టిబాబు బుధవారం తెలిపారు. శనివారం సాయంత్రం 4గంటలకు తాళ్లరేవు ఎన్‌ఫోర్స్‌మెంట్ బ్యూరో స్టేషన్‌లో వేలంపాట నిర్వహించనున్నట్టు పేర్కొన్నారు.

ఇంజనీరింగ్ అసిస్టెంట్ అదృశ్యంపై డీఎస్పీ విచారణ

తొండంగి, ఆగస్టు 7: జీఎంపేట ఇంజనీరింగ్ అసిస్టెంట్ అదృశ్యంపై పెద్దాపురం డీఎస్పీ లతాకుమారి బుధవారం విచారణ జరిపారు. తొండంగి పోలీస్ స్టేషన్‌లో ఆమె కేసుకు సంబంధించిన ఎఫ్ఐఆర్ కాపీని పరిశీలించారు. స్థానిక పోలీసు అధికారులతో కేసుపై చర్చించారు. జీఎంపేట సచివాలయ ఉద్యోగుల నుంచి పలు వివరాలు సేకరించారు. అనంతరం ఆమె బీచ్‌రోడ్ మీదుగా కుంభాభిషేకం రేవు వరకూ వెళ్లి పరిశీలించారు. ఆమె వెంట ఎస్ఐ వినయ్ ప్రతాప్,హెచ్‌సి పాండురంగారావు తదితరులున్నారు.

ప్రాణాలకు తెగించి..పైపులు ఏర్పాటు!

వరద ఉధృతితో గొల్లప్రోలు జగనన్న కాలనీకి తాగునీటి సరఫరా కష్టాలు


ట్యాంకర్‌కు భారీ పైపు తగిలించేందుకు వరద నీటిలోనే తాడు సహాయంతో వెళ్తున్న కాలనీవాసులు


గొల్లప్రోలు జగనన్న కాలనీకి ప్రత్యామ్నాయ రహదారి ఏర్పాటుపై పరిశీలన జరుపుతున్న డ్వామా పీడీ

గొల్లప్రోలు, ఆగస్టు 7: వరద ఉధృతిలోనే ప్రాణాలకు తెగించి పైపులు ఏర్పాటు చేసి జగనన్న కాలనీ వాసులకు తాగునీటిని అందించేందుకు చేసిన ప్రయత్నం అందరి ప్రశంసలు అందుకుంది. గొల్లప్రోలు పట్టణ శివారులోని జగనన్న కాలనీకి వెళ్లే ప్రధాన రహదారిపై సుద్దగడ్డ వరద నీరు ఐదున్నర అడుగుల ఎత్తున ప్రవహిస్తున్నది. వరద ఉధృతి అధికంగా ఉన్న నేపథ్యంలో తాగునీటి ట్యాంకర్లు కాలనీకి వెళ్లేందుకు వీలు లేకుండా పోయింది. దీంతో నగర పంచాయతీ అధికారులు 2 ట్యాంకర్లు ఏర్పాటు చేశారు. అగ్నిమాపకశాఖ సహకారం తీసుకుని వారి నుంచి అత్యవసర సమయాల్లో నీటిని వెదజల్లే పైపులు తీసుకున్నారు. జగనన్న కాలనీకి ఒకవైపు ట్యాంకరు ఏర్పాటు చేసి ఫైర్ శాఖ నుంచి తీసుకున్న ఇంజన్ సహాయంతో కాలనీ వైపు ఏర్పాటు చేసిన ట్యాంకరుకు పైపుల ద్వారా నీటిని నింపాలని నిర్ణయించారు. వరద ఉధృతి ప్రమాదకరంగా ఉండడంతో నీటిలో దిగి పైపులు ఏర్పాటు చేసేందుకు ఎవరు ముందుకు రాలేదు. దీనితో కాలనీవాసులు తాడు ఏర్పాటు చేసుకుని దానిని పట్టుకుని పైపును అవతలి వైపునకు వెళ్లారు. అత్యంత ప్రమాదకరమని తెలిసిన వారు ముందుకు రావడంతో పైపుల ద్వారా ట్యాంకర్‌లో తాగునీటిని నింపగలిగారు. ఈ నీటిని కాలనీ వాసులకు అందించారు. పనులను జనసేన నియోజకవర్గ ఇన్‌చార్జి మర్రెడ్డి శ్రీనివాసరావు, నగరపంచాయతీ కమిషనరు రవికుమార్‌లు పర్యవేక్షించారు.

వరద నీటిలోనే రాకపోకలు

గొల్లప్రోలు పట్టణ శివారు సూరంపేట సుద్దగడ్డ వరద దిగ్బంధంలో చిక్కుకుంది. చుట్టూ నీరు చేరడంతో అక్కడి ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. సూరంపేటకు చెందిన విద్యార్థులు గొల్లప్రోలులోని వివిధ పాఠశాలలు, కళాశాలలకు వరద నీటిలోనే రాకపోకలు సాగిస్తున్నారు. బాలబాలికలను వారి తల్లిదండ్రులు, కుటుంబసభ్యులు ఎత్తుకుని వరద నీటిని దాటిస్తున్నారు. బుధవారం వరద ఉధృతి మరింత అధికం కావడంతో ప్రమాదకరంగా ఉన్న నీటిలోనే వారు పాఠశాలలకు వెళ్లారు. సూరంపేటకు తాగునీటి సరఫరా లేకపోవడంతో అక్కడి ప్రజలు వరద నీటిలోనే నూతిలో నీరు తోడుకుని పట్టుకుని వచ్చేందుకు వెళ్తున్నారు. కాలువగట్టుపై వరద నీరు ప్రవహిస్తున్నది. కాగా సుద్దగడ్డ వరద ఉధృతి అధికం కావడంతో పట్టణంలోని అరుందతీయ కాలనీ, శివాలయం మాన్యం కాలనీల్లోకి వరద నీరు చేరింది. కాలనీ వాసులు ఆందోళన చెందుతున్నారు.

ప్రత్యామ్నాయ రహదారికి ఆదేశం

గొల్లప్రోలు శివారులోని జగనన్న కాలనీకి ప్రత్యామ్నాయ రహదారి ఏర్పాటుకు పరిశీలన జరపాలని కలెక్టరు షణ్మోహన్ ఆదేశించారు. సుద్దగడ్డ వరద కారణంగా తమకు రాకపోకలకు వీలు లేక కుటుంబాలు పస్తులుండాల్సిన పరిస్థితి నెలకొందని ఏఐఎఫ్‌టీయూ ఆధ్వర్యంలో కాలనీవాసులు మంగళవారం ఆందోళన చేయడంతో కలెక్టర్ ఆదేశాల మేరకు ప్రత్యామ్నాయ మార్గాలు ఏర్పాటుపై డ్వామా పీడీ వెంకటలక్ష్మి బుధవారం పరిశీలన జరిపారు. తాటిపర్తి పాపయ్యచెరువు పక్క నుంచి 1.20కిలో మీటర్ల పొడవునా రోడ్డు నిర్మాణం చేపడితే కాలనీవాసుల రాకపోకలకు ఏ ఇబ్బంది లేకుండా ఉంటుందని గుర్తించారు. దీనికి అంచనాలు తక్షణం సిద్ధం చేయాలని పంచాయతీరాజ్ మండల ఇంజనీరింగ్ అధికారి కృష్ణమోహన్, ఏపీవో కొండలరావును ఆదేశించారు.

పలుచోట్ల భారీ వర్షం

రోడ్లు జలమయం


పిఠాపురంలో కురుస్తున్న వర్షం


సామర్లకోటలో ఆర్టీసీ కాంప్లెక్స్‌లో వర్షపునీరు

పిఠాపురం/గొల్లప్రోలు, ఆగస్టు 7: పిఠాపురం, గొల్లప్రోలు పట్టణాలతో పాటు పరిసర గ్రామాల్లో బుధవారం భారీ వర్షం కురిసింది. వరుసగా వర్షాలు కురుస్తుండడంతో ఏలేరు, పీబీసీ సహా అన్ని పంటకాలువలు నీటితో ఉధృతంగా ప్రవహిస్తున్నాయి. రోడ్లన్నీ జలమయమయ్యాయి. డ్రెయిన్లు పొంగిపొర్లి రహదారులపైకి నీరు చేరింది.

సామర్లకోట: సామర్లకోట పట్టణం, మండలంలోనూ బుధవారం ఉదయం నుంచీ ఎడతెరిపిలేకుండా భారీ వర్షం కురిసింది. దీంతో లోట్టు ప్రాంతాలు పూర్తిగా జలమయం కావడమేగాక పలు ప్రాంతాలు సుమారు 3 అడుగుల ఎత్తున వర్షంనీరు చేరింది దీంతో ప్రజలు తీవ్ర అసౌకర్యానికి గురయ్యారు. భారీవర్షంతో వ్యవసాయానికి ఎంతో మేలు చేకూర్చిందని రైతులు ఆనందం వ్యక్తం చేశారు. కరపెండలం పంటలకు మేలు చేకూర్చడమే గాక పంటను ఆశించిన కసావా మొజాయిక్, తెల్లనల్లి తెగుళ్ల ఉధృతి పూర్తిగా తగ్గే అవకాశాలున్నాయని చెబుతున్నారు.

కిర్లంపూడి: భారీ వర్షానికి మండలంలో పలుచోట్ల పంట పొలాలు నీటమునిగాయి. ఏలేరు కాలువలో నీరు ఉధృతంగా ప్రవహించడంతో వర్షపునీరు, ఏలేరు కాలువ నీటితో వరి నారుమడులు మునిగి తేలుతున్నాయి.

కరప: మండలవ్యాప్తంగా బుధవారం కురిసిన భారీవర్షానికి లోతట్టు ప్రాంతాలు జలమయమయ్యాయి. ప్రధానరహదారులు, వీధుల్లో వర్షంనీరు నిలిచిపోవడంతో ప్రజలు రాకపోకలు సాగించడానికి ఇబ్బందులు పడ్డారు. కరపలో ఎంపీడీవో కార్యాలయంతో బాటు హైస్కూల్ ముంపు బారిన పడ్డాయి. ఆయా గ్రామాల్లో డ్రైన్‌లకు అవుట్‌లెట్‌లు లేక మురుగునీరంతా రోడ్లపైకి చేరింది. పలు చోట్ల వరినాట్లు నీట మునిగాయని రైతులు తెలిపారు.

ప్రధాన రహదారి ఛిద్రం


జె.అన్నవరం జంక్షన్‌లో రోడ్డుపై వర్షపునీరు

ఏలేశ్వరం, ఆగస్టు 7: ఏలేశ్వరం- జె.అన్నవరం ప్రధాన రహదారి ఛిద్రంగా మారింది. నిత్యం రద్దీగా ఉండే ఈ రోడ్డుకు మరమ్మతులు నిర్మించాలని పలువురు కోరుతున్నారు. ఏలేశ్వరంలో అంబేడ్కర్ నగర్, మెక్కారావు కాలనీ, మెయిన్ రోడ్డు, లింగవరం కాలనీ, పెద్దవీధిలో చెరువులను తలపించేలా గోతులు ఏర్పడ్డాయి. వర్షం వస్తే ఈ గోతుల్లో నీరు చేరడంతో రోడ్డుపైనే నీరు నిలిచిపోతుంది.

విద్యుదాఘాతంతో యువకుడి మృతి

కరప, ఆగస్టు 7: విద్యుదాఘాతంతో ఒడిస్సాకు చెందిన యువకుడు మృతిచెందినట్టు కరప పోలీసులు తెలిపారు. మండలంలో అరట్లకట్ట గ్రామానికి చెందిన వై.సతీష్ స్థానికంగా ఆక్వా చెరువులను సాగుచేస్తున్నాడు. ఆ చెరువుల వద్ద పనిచేయడానికి ఒడిస్సా నుంచి ఖగేశ్వర్‌మాలి (21) మరో ఐదుగురితో కలిసి 3నెలల క్రితం వచ్చాడు. కృష్ణమాలి, బుద్ధిమాలితో కలిసి అతడు బుధవారం రొయ్యల చెరువుల వద్దకు వెళ్లాడు. చెరువులో నీరు పట్టే మోటరు నుంచి నీళ్లు రావడంలేదని గుర్తించిన ఖగేశ్వర్ మాలి దానికి ఉండే ఇనుప గొట్టాన్ని పట్టుకుని నీరు పోస్తుండగా విద్యుదాఘాతం కలిగి చెరువుగట్టుపై పడిపోయాడు. సహచర మిత్రులు కాకినాడ ప్రభుత్వాసుపత్రికి తరలించగా అప్పటికే మృతిచెందినట్టు వైద్యులు ధ్రువీకరించారు. కేసు నమోదు చేసినట్టు పోలీసులు తెలిపారు.

తగ్గని జ్వరం కేసులు

గొల్లప్రోలు రూరల్, ఆగస్టు 7: ఏపీ మల్లవరంలో జ్వరం కేసులు తగ్గడం లేదు. బుధవారం ప్రత్యేక వైద్యశిబిరంలో 24 మంది వైద్య పరీక్షలు చేయించుకున్నారు. ముగ్గురికి జ్వరాలు ఉన్నట్లు గుర్తించారు. వీరు గాక పలువురు ప్రవేటు ఆసుపత్రులకు చికిత్స నిమిత్తం వెళ్తున్నారు.

అగ్నికుల క్షత్రియులను ఎస్సీ జాబితాలో చేర్చాలి

మాజీ మంత్రి మల్లాడి కృష్ణారావు


కోరింగలో మాట్లాడుతున్న మల్లాడి

తాళ్లరేవు, ఆగస్టు 7: సముద్రంలో మత్స్యసంపద నశించిపోయి చేపలవేట లేక ఇబ్బందులు పడుతున్న అగ్నికుల క్షత్రియులను ప్రభుత్వం ఎస్సీ జాబితాలోకి చేర్చాలని పుదుచ్చేరి మాజీ మంత్రి, ఢిల్లీ అధికారప్రతినిధి మల్లాడి కృష్ణారావు అన్నారు. బుధవారం కోరింగలో దివంగత పొన్నమండ లక్ష్మణ స్వామివర్మ 155వ జయంతి కార్యక్రమాన్ని అగ్నికుల క్షత్రియ ఐక్యమహాసంఘం ఆధ్వర్యంలో నిర్వహించారు. పొన్నమండ లక్ష్మణస్వామివర్మ చిత్రపటానికి పూలమాలలతో పలువురు ఘనంగా నివాళులర్పించారు. మల్లాడి మాట్లాడుతూ అన్నిరంగాల్లో వెనుకబడి ఉన్న అగ్నికులక్షత్రియులను ఎస్సీల జాబితాల్లో చేర్చాలని ప్రభుత్వంతో చేస్తున్న పోరాటం కొనసాగిస్తామన్నారు. ఇచ్ఛాపురం నుంచి భైరవపాలెం వరకు సముద్రంలో గ్యాస్‌నిక్షేపాలు వెలికితీసే కంపెనీల వల్ల అగ్నికుల క్షత్రియులు జీవనోపాధిని కోల్పోతున్నారని, అటువంటి కంపెనీలు అగ్నికులక్షత్రియులకు నష్టపరిహారం చెల్లించాల్సిందేనన్నారు. కోరింగలో త్వరలో ఏర్పాటు చేయబోయే అగ్నికులక్షత్రియ నాయకుల విగ్రహాలకు ఏర్పాటుకు సహకారం అందిస్తామన్నారు. ఎమ్మెల్యే దాట్ల బుచ్చిబాబు మాట్లాడుతూ కుల మతాలతీతంగా పనిచేసి అగ్నికులక్షత్రియుల అభివృద్ధికి కృషి చేస్తామన్నారు. కార్యక్రమంలో సర్పంచ్ పెయ్యల మంగేష్, అగ్నికుల క్షత్రియనేతలు బొడ్డు సత్యనారాయణ, వైదాడి నూకరాజు, అగ్నికుల క్షత్రియ ఉద్యోగసంఘం పాల్గొన్నారు.

'మోదీ విధానాలను ప్రతిఒక్కరూ వ్యతిరేకించాలి'


మాట్లాడుతున్న సత్యనారాయణమూర్తి


కాకినాడ సిటీ, ఆగస్టు 7: కేంద్రంలో బీజేపీ ప్రభుత్వం ఏర్పడిన నుంచి గౌతమ్ అదాని, అంబాని సోదరులు, అనిల్ అగర్వాల్ వంటి బడా కార్పొరేట్ వ్యవస్థలకు రాయితీలు కల్పిస్తూ కోట్లాది రూపాయలు రుణాలు మాఫీ చేస్తూ దేశ సంపదను దోచిపెడుతున్న ప్రధాని మోదీ విధానాలను ప్రతిఒక్కరూ వ్యతిరేకించాలని, దేశంలో తీవ్రంగా అప్పులో కూరుకుపోయిన రైతులను కాపాడుకోవాలని సీపీఐ రాష్ట్ర సహాయ కార్యదర్శి జేవీ.సత్యనారాయణమూర్తి పిలుపునిచ్చారు. కాకినాడ అన్నదాన సమాజంలో సీపీఐ కాకినాడ జిల్లా జనరల్ బాడీ సమావేశం పార్టీ జిల్లా కార్యదర్శి కె.బోడకొండ అధ్యక్షతన బుధవారం జరిగింది. ముఖ్యఅతిథిగా సత్యనారాయణమూర్తి మాట్లాడుతూ ఎప్పుడూ లేనంతగా దేశంలో నిరుద్యోగం 43 శాతానికి పెరిగిం దన్నారు. మరో ముఖ్యఅతిథి సీపీఐ రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యుడు డేగ ప్రభాకర్ మాట్లాడుతూ ఈనెల 9న క్విట్ కార్పొరేట్ కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని, రైతులు, కార్మికులు ఐక్యంగా ఉద్యమించాలని పిలుపునిచ్చారు. ప్రత్యేక అతిథిగా సీపీఐ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు తాటిపాక మధు మాట్లాడుతూ పార్టీ శత జయంతి ఉత్సవాలు వాడవాడలా నిర్వహించాలన్నారు. సమావేశంలో సీపీఐ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు తాటిపాక మధు, ఏఐటీయూసీ సీనియర్ నాయకుడు కిర్ల కృష్ణారావు, జిల్లా సహాయ కార్యదర్శి తోకల ప్రసాద్, జిల్లా కార్యవర్గ సభ్యుడు పి.సత్యనారాయణ, మున్సిపల్ కార్మిక నాయకులు టి.అన్నవరం, కె.అప్పలరాజు, పీఎస్ నారాయణ పాల్గొన్నారు.

'అతిసార పట్ల నిర్లక్ష్యం తగదు'

జీజీహెచ్ (కాకినాడ) ఆగస్టు 7: ఒకరి నుంచి మరొకరికి వేగవంతంగా వ్యాప్తి చెందే అతిసార వ్యాధిపట్ల నిర్లక్ష్యం తగదని కాకినాడ జీజీహెచ్ సూపరిండెంట్ డాక్టర్ ఎస్.లావణ్యకుమారి అన్నారు. గతనెలలో కురిసిన వర్షాల వల్ల లోతట్టు ప్రాంతాలు జలమయమైన విషయం తెలిసిందే. ఈ క్రమంలో ముఖ్యంగా నీరు కలిషితం కావడంవల్ల, సరైన జాగ్రత్తలు తీసుకోకపోవడం వల్ల అతిసారం(డయేరియా)కి గురైన వారి సంఖ్య అధికంగా ఉంది. ఇందునిమిత్తం ప్రాణాపాయంలో ఉన్న డయేరియా బాధితులకు కాకినాడ జీజీహెచ్‌లో ప్రత్యేక చికిత్స అందజేసినట్టు ఆమె తెలిపారు. 86మందికి జీజీహెచ్‌లో చికిత్స అనంతరం పునర్జన్మ ఏర్పడిందన్నారు. వాంతులు, నీళ్ల విరోచనాలు, పొట్ట నొప్పి, అతినీరసం ఈ వ్యాధి లక్షణాలన్నీ ఇది త్వరితగతిన వ్యాప్తి చెందడం వల్ల అనేకమంది ఆస్పత్రుల పాలయ్యారన్నారు. జీజీహెచ్‌లో ప్రాణాపాయంలో ఉన్నవారికి ఐసీయూ పర్యవేక్షణలో ఉంచి సంపూర్ణ ఆరోగ్యంతో డిశ్చార్జ్ చేసినట్టు వెల్లడించారు. ఈ విధమైన లక్షణాలు కనబడితే నిర్లక్ష్యం చేయకుండా అర్హత కలిగిన వైద్యుడిని సంప్రదించాలన్నారు.

వేణుగోపాలస్వామి గర్భగుడికి ఇత్తడి ద్వారం

పిఠాపురం, ఆగస్టు 7: పట్టణంలో పంచాయతన సమేత వేణుగోపాలస్వామి ఆలయ గర్భగుడికి ఇత్తడి ద్వారం ఏర్పాటు చేశారు. హైదరాబాదుకు చెందిన తీడ వెంకటేశ్వరరావు దంపతుల సహకారంతో రూ.1.10లక్షల వ్యయంతో ఇత్తడి ద్వారాన్ని తయారు చేయించారు. దీనిని బుధవారం గర్భగుడికి అమర్చారు. ఈ కార్యక్రమానికి సహకరించిన దాతలకు ఆలయ ఈవో నున్న శ్రీరాములు, అర్చకుడు పి.విజయజనార్థనాచార్యులు కృతజ్ఞతలు తెలియజేశారు.


ఆలయ గర్భగుడికి ఏర్పాటు చేసిన ఇత్తడి ద్వారం

తల్లిపాల వారోత్సవాలు

కార్పొరేషన్ (కాకినాడ), ఆగస్టు 7: తల్లిపాల వారోత్సవాల్లో భాగంగా కాకినాడ అర్బన్ ప్రాజెక్టు దుమ్మలపేట సెక్టార్‌లో యూపీహెచ్‌సీ సంజయ్‌నగర్‌లో అవగాహన సదస్సు నిర్వహించారు. సూపర్‌వైజర్ దయామణి అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో డాక్టర్ వినీల్ తల్లులకు తల్లిపాలపై పలు సూచనలిచ్చారు. చైల్డ్‌ఫండ్ ఇండియా ప్రోగ్రాం కోఆర్డినేటర్ స్వాతి తల్లిపాలు ప్రాముఖ్యతపై వివరించారు. ఈ సందర్భంగా 15మంది గర్భిణులకు సీమంతాలు నిర్వహించగా పదిమంది పిల్లలకు అన్నప్రాసనలు చేపట్టారు.

గండేపల్లి: సూరంపాలెం సచివాలయంలో సీడీపీవో పూర్ణిమ ఆధ్వర్యంలో తల్లిపాలపై అవగాహన సదస్సు నిర్వహించారు. గర్భిణులకు సర్పంచ్ మారిసెట్టి గంగాభవానీ, పోసిన బాబురావు ఆధ్వర్యంలో సీమంతం నిర్వహించారు. పోసిన బాబురావు, సీహెచ్‌వో శ్రీనివాసరావు, మెడికల్ హెచ్‌వి శ్రీదేవి, ఎంపీహెచ్ వై.శ్రీనివాస్, ఏఎన్ఎం భవానీ పాల్గొన్నారు.

శంఖవరం: కత్తిపూడిలో తల్లిపాలు వారోత్సవాలను ఐసీడీఎస్ సీడీపీవో టీడీఆర్ పద్మావతి ఆధ్వర్యంలో నిర్వహించారు. గర్భిణులకు సామూహిక సీమంతాలు నిర్వహించారు. వెన్నా ఈశ్వరుడు గర్భిణులకు చీరలు అందజేశారు. రోతు శివ, లచ్చబాబు, అంగన్‌వాడీ సూపర్‌వైజర్స్ పాల్గొన్నారు.

జేఎన్టీయూకేలో ఇండక్షన్ ప్రోగ్రామ్

జేఎన్టీయూకే, ఆగస్టు 7: వర్సిటీలోని అలూమ్నీ ఆడిటోరియంలో మొదటి సంవత్సర బీటెక్, మెడికల్ విద్యార్థులకు జాతి నిర్మాణంలో మహిళల పాత్రపై ఇండక్షన్ ప్రోగ్రామ్‌ను నిర్వహించారు. యూసీఈకే కెమిస్ట్రీ విభాగాధిపతి డాక్టర్ ఎస్.సత్యవేణి, పీఈ విభాగాధిపతి డాక్టర్ కె.కృష్ణభాస్కర్ సమన్వయకర్తలుగా వ్యవహరించగా ఇన్‌చార్జి వీసీ కేవీఎస్‌జీ మురళీకృష్ణ ముఖ్యఅతిథిగా, విశ్రాంత ఐఎఫ్ఎస్ అధికారిణి సి.రామలక్ష్మి విశిష్ట అతిథిగా, రెక్టార్ కేవీరమణ, ఈవోడబ్ల్యూజీ డైరెక్టర్ స్వరూపారాణి, యూసీఈకే ప్రిన్సిపాల్ మోహన్‌రావు, వైస్‌ప్రిన్సిపాల్ రత్నకుమారి అతిథులుగా పాల్గొన్నారు.

గృహ నిర్మాణాల పూర్తికి చొరవ చూపాలి : పీడీ


ఇళ్ల నిర్మాణాలపై అధికారులతో సమీక్షిస్తున్న పీడీ

తుని రూరల్, ఆగస్టు 7: గృహ నిర్మాణాల పూర్తికి చొరవ చూపాలని డిప్యూటీ కలెక్టర్, గృహ నిర్మాణశాఖ పీడీ ఎస్‌వీవీ సత్యనారాయణ తెలిపారు. ఆయన తుని పట్టణ, గ్రామీణ ప్రాంతాల్లో గృహ నిర్మాణ సంస్థ అధికారులతో కలిసి లేఅవుట్‌లో ఇళ్ల నిర్మాణ పనులను పరిశీలించారు. అనంతరం స్థానిక మున్సిపల్ కార్యాలయంలో అధికారులతో సమావేశం నిర్వహించి ఇళ్ల పురోగతిపై సమీక్షించారు. మహిళా సంఘాలలో సభ్యులు ఇళ్ల నిర్మాణానికి ముందుకు వస్తే అదనంగా రూ.50వేలు రుణంగా అందిస్తామని తెలిపారు. కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ వెంకట్రావు తదితరులు ఉన్నారు.

పెద్దాపురం సీఐగా క్రాంతికుమార్



పెద్దాపురం, ఆగస్టు 7: పెద్దాపురం సీఐగా టి.క్రాంతి కుమార్ బుధవారం బాధ్యతలను చేపట్టారు. ఆయన ఏలూరు జిల్లా జీలుగుమిల్లి సర్కిల్ ఇనస్పెక్టర్‌గా పనిచేస్తూ బదిలీపై ఇక్కడకు వచ్చారు. ఇప్పటివరకూ సీఐగా పనిచేసిన వై.రవికుమార్ వీఆర్ ఏలూరు రేంజ్‌కు బదిలీ అయ్యారు. బాధ్యతలు చేపట్టిన అనంతరం డీఎస్పీ లతాకుమారీని మర్యాదపూర్వకంగా కలిశారు. సీఐకు ఎస్ఐ మౌనిక, సిబ్బంది తదితరులు శుభాకాంక్షలు తెలిపారు.

సామర్లకోట సీఐ రిలీవ్

సామర్లకోట, ఆగస్టు 7: సామర్లకోట పోలీస్‌స్టేషన్ సీఐగా గత శుక్రవారం బాధ్యతలు స్వీకరించిన అంకబాబు విధుల నుంచి రిలీవ్ అయ్యారు. గతంలో చింతూరులో ఆయన సీఐగా పనిచేసిన కాలంలో గంజాయి అక్రమ రవాణా కేసులకు చెందిన ప్రమేయంపై ఆరోపణలు ఉన్నట్టు సమాచారం. విధుల నుంచి తొలగాల్సిందిగా పైస్థాయి నుంచి ఆదేశాల అందడంతో మంగళవారం రాత్రి అంకబాబు విధుల నుంచి తప్పుకున్నారు. ఆయన స్థానంలో ఎవర్ని నియమించలేదు.

డి.పోలవరంలో 'పొలంబడి'

తుని రూరల్, ఆగస్టు 7: పంటసాగులో మెళకువలు పాటిస్తే అధిక దిగుబడులు సాధ్యమని తుని ఏడీఏ ఎస్.బుల్లిబాబు తెలిపారు. డి.పోలవరంలో నిర్వహించిన పొలంబడి కార్యక్రమంలో ఆయన వరి పంటల గట్ల చుట్టూ పూలమొక్కల సాగు, తాడుసహాయంతోవరి నారును నాటించడంపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో అగ్రికల్చర్ అసిస్టెంట్ లోవరాజు, శ్రీను, శివాజీ, వెంకటేష్ తదితరులున్నారు.

మురుగునీరు పరిశీలన

తాళ్లరేవు, ఆగస్టు 7: పోలేకుర్రు పంచాయతీ తోటపేట, యాదవపేటలోని రోడ్డుపై నిల్వఉన్న మురుగునీటిని తాళ్లరేవు ఎంపీపీ రాయుడు సునీత బుధవారం పరిశీలన చేశారు. ఇంజనీరింగ్ అసిస్టెంట్, పంచాయతీ కార్యదర్శి జ్యోతి సుధతో చర్చించి రోడ్డు నిర్మాణానికి అంచనాలు తయారుచేయాలని ఆదేశించారు. కార్యక్రమంలో టీడీపీ నేతలు రాయుడు గంగాధర్, జక్కుల ప్రసాద్‌బాబు, సాదనాల శివరామకృష్ణ, వూడా రామకృష్ణ, రేవు గోవ్యారాజు, జనిపల్లి ఈశ్వరరావు, పంచాయతీ వెల్ఫేర్ ఆఫీసర్ వినయ్‌కుమార్ పాల్గొన్నారు.

పోస్టుమాన్‌కు అవార్డు

రౌతులపూడి, ఆగస్టు 7: ఎక్కువ మందికి యూపీఐ సేవలందించినందుకు రౌతులపూడి పోస్టుమాన్ కొత్తా సునీల్‌కుమార్‌కు అవార్డు వచ్చింది. కాకినాడ సూపరిండెంట్ శ్రీనివాస్, ఇండియన్ పోస్టు పేమెంట్ బ్యాంక్ మేనేజర్ రాజీ కుమార్ బుధవారం కాకినాడలో అవార్డు అందజేశారు. సునీల్‌కుమార్‌ను సిబ్బంది అప్పారావు, తేజ అభినందించారు.

'ఆదిత్య'లో తరగతులు ప్రారంభం

గండేపల్లి, ఆగస్టు 7: మండలంలోని సూరంపాలెం ఆదిత్య యూనివర్శిటీ ఇంజనీరింగ్ మొదటి సంవత్సరం విద్యార్థులకు తరగతులను ప్రారంభించినట్టు డిప్యూటీ ప్రోచాన్సలర్ డాక్టర్ ఎం.శ్రీనివాసరెడ్డి తెలిపారు. ఆదిత్య వైస్ చైర్మన్ డాక్టర్ ఎన్.సతీష్‌రెడ్డి అధ్యక్షతన నిర్వహించిన విద్యార్థులు, తల్లిదండ్రుల సమావేశానికి ఆదిత్య యూనివర్శిటీ ఛాన్సలర్ డాక్టర్ నల్లమిల్లి శేషారెడ్డి ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. వైస్ చాన్సలర్ ఎంబి శ్రీనివాస్, డీన్ స్కూల్ ఆఫ్ ఇంజనీరింగ్ డాక్టర్ డోలా సంజయ్, ప్రో వైస్‌చాన్సలర్ అకడమిక్స్ డాక్టర్ ఎస్.రమాశ్రీ, రిజిస్ట్రార్ జి.సురేష్, టెక్నికల్ హబ్ సీవో బాబ్జీనీలం ఉన్నారు.

రాపర్తిలో గంగాలమ్మ జాతర

పిఠాపురం రూరల్, ఆగస్టు 7: పిఠాపురం మండలం రాపర్తిలో గంగాలమ్మ తల్లి జాతర మహోత్సవాలు వైభవంగా జరిగాయి. బుధవారం గరగనృత్యాలు, కోలాటం ఆకట్టుకున్నాయి. కార్యక్రమాల్లో భక్తులు అధిక సంఖ్యలో పాల్గొనగా, ఆలయ కమిటీ ప్రతినిధులు ఏర్పాట్లు పర్యవేక్షించారు.

'ప్రజల సౌకర్యార్థం టోల్ ఫ్రీ నంబర్'

పెద్దాపురం, ఆగస్టు 7: పెద్దాపురం పురపాలక సంఘ పరిదిలో ప్రజల సౌకర్యార్థం ఏర్పాటుచేసిన టోల్ ఫ్రీ నంబరును సద్వినియోగం చేసుకోవాలని మున్సిపల్ కమిషనర్ కేవీ పద్మావతి కోరారు. పారిశుద్ధ్య నిర్వహణ, నీటి సరఫరా, వీధి దీపాల నిర్వహణకు సంబంధించి 08852 242100 నంబరుకు ఫోన్ చేసి ఫిర్యాదు చేయవచ్చని ఆమె కోరారు.

తుమ్మలపల్లి పరామర్శ

కిర్లంపూడి, ఆగస్టు 7: మండలంలోని సింహాద్రిపురానికి చెందిన కందా కొండలరాయుడు మరణించడంతో జనసేన పార్టీ జగ్గంపేట ఇన్‌చార్జి తుమ్మలపల్లి రమేష్ వారి కుటుంబాన్ని పరామర్శించి ప్రగాఢ సానుభూతి తెలిపారు.